ప్రజాశక్తి
ఆదివారం 4 జూన్ 2023

పిడుగుపాటుకు 20 మేకలు మృతి

మెళియాపుట్టి : మండలంలోని చాపర సమీపంలో శనివారం సాయంత్రం పిడుగుపాటుకు 20 మేకలు మృత్యువాత పడ్డాయి. జోడూరు, చాపర గ్రామాలకు చెందిన మద్దిల రామ్మూర్తి, బల్ల మల్లేషు, వంజరాపు తాతయ్యలకు 200 మేకలను మేతకు విడిచిపెట్టారు. అనంతరం వారు తమ ఇళ్లకు చేరుకున్నారు. సాయంత్రం ఒక్కసారిగా మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. పిడుగుపాటుకు 20 మేకలు మృతి చెందాయి. వర్షం తగ్గాక వెళ్లి చూడగా రామ్మూర్తికి చెందిన 11, మల్లేషుకు చెందిన 6, తాతయ్యకు చెందిన 3 మేకలు మృతి చెంది ఉన్నాయి. సుమారు రూ.రెండు లక్షల వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

సంతబొమ్మాళిలో విషాదం

- రైలు ప్రమాదంలో జిల్లావాసి మృతి
- మరో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - సంతబొమ్మాళి

ఒడిశా రాష్ట్రం బాలేశ్వర్‌లో సంభవించిన రైలు ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లా జగన్నాథపురానికి చెందిన వలస మత్స్యకారుడు చోడిపల్లి గురుమూర్తి (63) మృతి చెందారు. కుటుంబసభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గురుమూర్తి ఉపాధి నిమిత్తం ఒడిశాలోని బాలేశ్వర్‌కు వలస వెళ్లాడు. అక్కడ వలలు కుడుతూ ఆయన జీవనం సాగిస్తుండగా, భార్య రమణమ్మ రొయ్యల ఫ్యాక్టరీలో ప్యాకింగ్ పనులు చేస్తోంది. ప్రతినెలా వృద్ధాప్య పెన్షన్ కోసం గురుమూర్తి గ్రామానికి వస్తుంటాడు. గత నెల 29న వచ్చి పెన్షన్ తీసుకున్నాక రెండో తేదీన తిరుగు పయనమయ్యాడు. కోటబొమ్మాళి రైల్వేస్టేషన్‌లో విశాఖ ఎక్స్‌ప్రెస్ ఎక్కి భువనేశ్వర్‌లో దిగాడు. అక్కడ నుంచి బాలేశ్వర్‌కు యశ్వంతపూర్ రైలులో బయలుదేరి రైలు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. కుమార్తెలకు వివాహమైనా కుటుంబ సమస్యలతో తల్లిదండ్రుల ఇంటి వద్దే ఉన్నారు. ప్రతినెలా గురుమూర్తి, రమణమ్మ స్వగ్రామానికి వచ్చి పది రోజులు ఉండి వెళుతుంటారు. ఈసారి మాత్రం గురుమూర్తి ఒక్కరే వచ్చి నాలుగు రోజులు ఉండి వెళ్లిపోయాడు. ఇంటి పెద్ద దిక్కును

గురుమూర్తి

కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. గురుమూర్తి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఇదే రైలులో ప్రయాణిస్తున్న మండలంలోని ఎం.కొత్తూరుకు చెందిన కారాడ ఎల్లమ్మకు రెండు చేతులూ విరిగిపోయాయి. ఆమె ఒడిశాలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. జగన్నాథపురానికి చెందిన మైలపల్లి రాజేశ్వరి స్వల్ప గాయాలతో బయటపడింది. ఒక్కసారిగా బోగీలు పల్టీలు కొట్టాయని, తమ బోగీ మాత్రం కుదుపునకు గురైందని తెలిపారు. ఈ ప్రమాదంలో స్వల్ప గాయాలై తృటిలో పెను

గాయపడి చికిత్స పొందుతున్న ఎల్లమ్మ

ప్రమాదం నుంచి తప్పించుకుని ప్రాణాలతో బతికి బయటపడ్డామని తెలిపారు. ఆ సమయంలో ఎంతో భయాందోళనలకు గురయ్యామని ఆమె తెలిపారు. ఎల్లమ్మ, రాజేశ్వరి బాల్వేశ్వర్‌లోని రొయ్యల ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. వారు కూడా స్వగ్రామం వచ్చి వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది.

బాధితులకు టిడిపి పరామర్శ

ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితులను ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ శనివారం పరామర్శించారు. కటక్‌లోని ఎస్‌సిబి వైద్య కళాశాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఒడిశా రైలు ప్రమాద ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు, జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ పేర్కొన్నారు. ప్రమాదంలో మరణించిన కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

బాధితులకు బాసట

- ఒడిశాలోని బాలేశ్వర్‌కు జిల్లా బృందాలు
- పర్యవేక్షిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎం.నవీన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, పలాస

ఒడిశా రైలు ప్రమాద బాధితులకు ప్రభుత్వం బాసటగా నిలిచింది. అందులో భాగంగా జిల్లా నుంచి రెవెన్యూ, వైద్యశాఖ అధికారుల బృందాన్ని పంపింది. పౌర సరఫరాలశాఖ కమిషనర్ అరుణ్ కుమార్‌తో పాటు ఇన్‌ఛార్జి జిల్లా కలెక్టర్ ఎం.నవీన్ బాలేశ్వర్ జిల్లాలోని బహానగర్ ఘటనా స్థలానికి శనివారం చేరుకున్నారు. జిల్లా నుంచి రెస్క్యూ ఆపరేషన్ కోసం వెళ్లిన రెవెన్యూ, వైద్యారోగ్యశాఖ బృందాలకు పలు సూచనలు చేశారు. ఎపికి చెందిన ప్రయాణికులకు అందుతున్న సాయంపై అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. హెల్ప్‌లైన్ సెంటర్‌ను సందర్శించి ట్రైన్‌లో ప్రయాణిస్తున్న పలు జిల్లాలకు చెందిన వారి వివరాలను సంబంధిత కటుంబసభ్యులకు సమాచారం ఇచ్చేలా చూడాలని సూచించారు. మరోవైపు జిల్లా నుంచి వైద్యసాయం అందించేందుకు అధికార యంత్రాంగం అవసరమైన చర్యలు చేపట్టింది. జిల్లా నుంచి ఎనిమిది 108 వాహనాలు, మృతదేహాలను తరలించడానికి రెండు మహాప్రస్థానాలు, సిబ్బందిని అక్కడికి పంపారు. జిల్లా కేంద్రాస్పత్రి నుంచి మరో రెండు మహా ప్రస్థానాలను పంపారు. వీటి పర్యవేక్షణకు రెవెన్యూ, పోలీసు, వైద్యారోగ్య, రవాణ శాఖ అధికారులను బాలేశ్వర్‌కు పంపారు. వీరితోపాటు సహాయ, పునరావాస చర్యల కోసం తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్లు, విఆర్‌ఒలు, ఇతర సిబ్బందితో కూడిన 13 మందిని రెవెన్యూశాఖ అధికారులకు డెప్యుటేషన్‌పై బాలేశ్వర్‌కు పంపారు. వైద్యశాఖ

ఘటనాస్థలిని పరిశీలిస్తున్న అధికారులు

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నలుగురేసి వైద్యుల చొప్పున రెండు బృందాలను అధికారులు సిద్ధంగా ఉంచారు. క్షతగాత్రులను ఇచ్ఛాపురం నుంచి విశాఖపట్నం తరలించేందుకు ఇచ్ఛాపురం కాంప్లెక్స్‌లో నాలుగు బస్సులు, ఒక డిజిటిని ఏర్పాటు చేశారు. ఎమర్జెన్సీ డ్యూటీ క్యాంపు ఇన్‌ఛార్జిగా పలాస డిపో ఇన్‌ఛార్జి మేనేజర్ సంతోష్‌కుమార్‌ను నియమించారు. రైలు ప్రమాదం కారణంగా రైళ్లు రద్దు కావడంతో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఇచ్ఛాపురం, సోంపేట, పలాస, టెక్కలి నుంచి విశాఖపట్నంకు ప్రతిరోజూ తిరిగే బస్సులకు అదనంగా బస్సులు వేశారు.

కంట్రోల్‌రూమ్ ఏర్పాటు

ఒడిశా రైలు ప్రమాద ఘటనకు సంబంధించి సమాచారం కోసం కలెక్టరేట్‌లో 08942-286213, 286245 నంబర్లతో కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేశారు. రైలు ప్రమాదంలో ఎవరైనా చిక్కుకుంటే వివరాలు తెలపాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు.

రైళ్ల ఆలస్యంతో అవస్థలు

ప్రజాశక్తి - ఆమదాలవలస, పలాస, ఇచ్ఛాపురం

ఒడిశా రాష్ట్రం బాలేశ్వర్‌లో సంభవించిన రైలు ప్రమాదంతో శనివారం పలు రైళ్లు రద్దు కాగా, మరికొన్ని ఆలస్యంగా నడిచాయి. జిల్లా మీదుగా నడిచే పలు రైళ్లను ఇతర మార్గాల ద్వారా దారి మళ్లించడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పలేదు. హౌరా-నుంచి చెన్నై వెళ్లే మెయిల్, షాలిమార్-చెన్నై కోరమాండల్, హైదరాబాద్ - షాలిమార్ ఈస్టుకోస్ట్, హౌరా - సికింద్రాబాద్ ఫలక్‌నుమా, హౌరా - బెంగుళూర్ దురంతో వంటి రైళ్లను రద్దు చేశారు. కన్యాకుమారి-డిబ్రూఘర్ వెళ్లే వివేక్ ఎక్స్‌ప్రెస్‌ను దారిమళ్లించారు. పాట్నా - ఎర్నాకులం, బెంగళూరు - అగర్తల వంటి వారాంతపు రైళ్లను జార్సగూడ మీదుగా వయా రాయగడ విజయనగరం వైపు మళ్లించారు. రిజర్వేషన్లు చేసుకున్న ప్రయాణికులు రైల్వేస్టేషన్‌కు చేరుకుని రైళ్ల కోసం ఆరాతీశారు. రైళ్ల దారిమళ్లింపు జరిగిందని విజయనగరం వరకు వెళ్లి రైళ్లను ఎక్కవచ్చని రైల్వే అధికారులు చెప్పడంతో విశాఖపట్నం వైపు వెళ్లే రైళ్ల కోసం చూశారు. బరంపురం-విశాఖపట్నం, భువనేశ్వర్-విశాఖపట్నం ఇంటర్‌సిటీ, భువనేశ్వర్-సికింద్రాబాద్ విశాఖ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రయాణికులతో కిటకిటలాడాయి. రైళ్లు రద్దు కావడంతో తమ డబ్బులను వాపసు చేసుకునేందుకు రిజర్వేషన్ కేంద్రాల వద్దకు వెళ్లారు. ఒడిశా నుంచి వచ్చే రైళ్లలోని ప్రయాణికులకు శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్‌లో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పి.జగన్మోహనరావు ఆధ్వర్యాన బిస్కెట్లు, పాలు, మజ్జిగ, రొట్టెలు పంపిణీ చేశారు.

పలాస రైల్వేస్టేషన్ వద్ద రైళ్ల కోసం పడిగాపులు కాస్తున్న ప్రయాణికులు

నీలం జ్యూట్ మిల్లు కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

నీలం జ్యూట్ మిల్లు యాజమాన్యం తగ్గించిన రెండు క్యాజువల్ సెలవులు వెంటనే పునరుద్ధరించాలని, లేకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, నీలం జ్యూట్ మిల్లు కార్మిక సంఘం అధ్యక్షులు ఎం.నాగేశ్వరరావు హెచ్చరించారు. శ్రీకాకుళం రూరల్ మండలం సింగుపురంలోని నీలం జ్యూట్ మిల్లు యాజమాన్యం తగ్గించిన రెండు క్యాజువల్ సెలవులను పునరుద్ధరించి, గతంలో మాదిరిగా ఆరు క్యాజువల్ సెలవులు అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ కార్యాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీలం జ్యూట్ మిల్లు పరిశ్రమలో 500 మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. 1987లో పరిశ్రమ ప్రారంభం నుంచి కార్మికులందరికీ క్యాజువల్ లీవ్‌లు 6 అమలు చేస్తోందన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి రెండు తగ్గించి 4 సెలవులు మాత్రమే యాజమాన్యం నమోదు చేసిందని తెలిపారు. యాజమాన్యం ఏకపక్షంగా కార్మికులకు రెండు క్యాజువల్ లీవ్‌లు తగ్గించడం కార్మిక వ్యతిరేక చర్య అని అన్నారు. కార్మికులకు తక్కువ వేతనాలు ఇస్తూ శ్రమ దోపిడీకి గురిచేస్తున్న యాజమాన్యం, మరోవైపు ఇస్తున్న సెలవులు తగ్గించడం సరికాదన్నారు. సెలవులను పునరుద్ధరించాలని కోరుతూ కార్మికులు సంతకాలు చేసిన వినతిపత్రాన్ని యాజమాన్యానికి అందజేశామని తెలిపారు. అదే కాపీని డిసిఎల్ ఎస్.డి.వి ప్రసాదరావుకు అందజేశారు. ధర్నాలో నీలం జూట్ కార్మిక సంఘం నాయకులు బి.ముఖలింగం, జి.అప్పన్న, బి.అమ్మనరావు, డి.రాము తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న నీలం జ్యూట్ మిల్లు కార్మికులు

పర్యావరణాన్ని కాపాడుకుందాం

శ్రీకాకుళం : మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎం.నవీన్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ర్యాలీని శనివారం ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా రోజువారీ జీవితంలో మార్పులు చేసుకోవాలన్నారు. ప్రపంచీకరణ తర్వాత కాలుష్యం విపరీతంగా పెరిగి మానవ మనుగడకు ముప్పు వాటిల్లుతుందన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు పాటుపడతామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇ శంకర్ నాయక్, పర్యాటకశాఖ అధికారి నారాయణరావు, సెట్‌శ్రీ మేనేజర్ అప్పలనాయుడు, పర్యాటక యువ క్లబ్ సభ్యులు, రోటరీ క్లబ్ సభ్యులు జోగినాయుడు, హారిక ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం నగరపాలక సంస్థ - శ్రీకాకుళం

ఆర్.ఓ.సి.నెం.102654/2019/A2, తేది.03-06-2023

బహిరంగ వేలం ప్రకటన

శ్రీకాకుళం నగరపాలక సంస్థకు చెందిన షాప్ రూములకు వాటికి ఎదురుగా చూపబడిన కాలములకు లీజుకు ఇచ్చు విషయములో నగరపాలక సంస్థ కార్యాలయ అవరణలో కమిషనర్ వారిచే గాని లేదా వారి వలన అధికారము పొందబడిన వారి చేతనైనను తేది.19.06.2023న ఉదయం 10.30 గంటలకు ప్రారంభించబడి టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించబడును. అవసరమైనచో ఆ తరువాత దినముల యందు బహిరంగ వేలము కొనసాగును.

వ. నెం	వివరములు	కాల పరిమితి	నెలసరి అద్దె	చెల్లించవలసిన ధరావత్తు	దాఖలుచేయవలసిన సాల్వెన్సీ	వేలం తేదీ
	శ్రీ పొట్టి శ్రీరాములు మునిసిపల్ మార్కెట్ గ్రౌండ్ ఫ్లోర్ నందు గల ఖాళీగా ఉన్న 11 షాప్‌లు సి బ్లాక్ మెట్లు గది (GF) -01, డి బ్లాక్ 67 (GF) -01, ఇ&ఫ్ బ్లాక్ మెట్లు గది-(GF) - 01, ఇ&ఫ్ - 82(GF) - 01, ఒ,ఎస్-3,4,5,6,7,8,9,10,11,12,15(GF) =11	లీజుకిచ్చిన తేది నుండి 3 సంవత్సరములు	హెచ్చు పాట	రూ.50,000/-	రూ.5,00,000/-	
	శ్రీ పొట్టి శ్రీరాములు మునిసిపల్ మార్కెట్ మెదటి అంతస్తు నందు గల ఖాళీగా ఉన్న 42 షాప్ రూములకు ఎ బ్లాక్ -01, నుంచి 11&12,13,15,16 = 14, బి బ్లాక్ - 22,24,28,29&31,34 = 06, సి బ్లాక్ - 43,44 నుంచి 49 = 06, డి బ్లాక్ - 51,నుంచి 61&64 నుంచి 68 = 17, మొత్తం = 59					వేలం తేది : 19.06.2023 ఉదయం 10.30 గంటల నుండి
1.	పై షాప్ రూములలో మొదటి అంతస్తు ఎస్.సి.(S.C)లకు ఎ బ్లాక్‌లో 13&1,3,4,5,6,8,10,11; బి బ్లాక్‌లో షాప్ నెం. 34&28,29; సి బ్లాక్‌లో షాప్ నెం. 48&43,44,45; డి బ్లాక్‌లో షాప్ నెం. 66,67&51,52,57,61,64; ఎస్.టి(ST) లకు - ఎ బ్లాక్‌లో షాప్ నెం. 16&7,9,15; బి బ్లాక్‌లో షాప్ నెం. 31; సి బ్లాక్‌లో షాప్ నెం. 49&46; డి బ్లాక్‌లో షాప్ నెం. 54,55,56; **నాయ బ్రహ్మణులు మరియు రజకులకు :** ఎ బ్లాక్‌లో షాప్ నెం. 02; బి బ్లాక్‌లో షాప్ నెం. 22; సి బ్లాక్‌లో షాప్ నెం. 47; డి బ్లాక్‌లో షాప్ నెం. 53,58,59,60,65; **వికలాంగుల (HP) కేటగిరి :** గ్రౌండ్ ఫ్లోర్ నందు గల షాప్ నెం మొట్ల గది-**C,** గ్రౌండ్ ఫ్లోర్ నందు గల షాప్ నెం మొట్ల గది-**D,** గ్రౌండ్ ఫ్లోర్ నందు గల షాప్ నెం మొట్ల గది-**F/E,** షాప్ నెం - **F/E - 82**	లీజు కిచ్చిన తేది నుండి 3 సంవత్సరములు	హెచ్చు పాట	రూ.30,000/-	రూ.3,00,000/-	
2	శ్రీ పొట్టి శ్రీరాముల మున్సిపల్ మార్కెట్ నందు గల **E/F :** బ్లాక్: మొదటి అంతస్తు పై గల ఓపెన్ ఏరియా **40.00X28.00 చ.అ-1, 40.00X28.00 చ.అ-2**	లీజు కిచ్చిన తేది నుండి 3 సంవత్సరములు	హెచ్చు పాట	రూ.1,50,000/-	రూ.10,00,000/-	
3.	Opp N.T.R.M.H.SCHOOL వద్ద గల షాప్ నెంబర్లు - 17,21,23,25,27,28 పై షాప్ రూములలో SC లకు షాప్ నెం. 25.27.28 ST లకు షాపు నెం. 17,21 **మొత్తం = 05**	లీజు కిచ్చిన తేది నుండి 3 సంవత్సరములు	హెచ్చు పాట	రూ.30,000/-	రూ.5,00,000/-	
4.	జి.టి రోడ్ షాపింగ్ కాంప్లెక్స్ నందలి జనరల్ కేటగిరీకి చెందిన షాపు నెం. 04 **మొత్తం = 01**		హెచ్చు పాట	రూ.60,000/-	రూ.10,00,000/-	
5.	శ్రీ పొట్టి శ్రీరాములు జంక్షన్ వద్ద గల మొదటి అంతస్తు నందు ఖాళీగా ఉన్న షాప్ రూములకు 01 నుండి 06 మరియు 8 నుండి10 =03 పై షాపు రూములలో SC లకు, షాపు నెం.1,2,4,6&9 ST లకు షాపు నెం. 3,8, మరియు నాయ బ్రహ్మణులు షాపు నెం. 5 గలవి. **మొత్తం = 10**	లీజు కిచ్చిన తేది నుండి 3 సంవత్సరములు	హెచ్చు పాట	రూ.30,000/-	రూ.3,00,000/-	
6.	శ్రీ పొట్టి శ్రీరాములు మునిసిపల్ మార్కెట్ నాగావళి కృష్ణ లైన్ నందు మొదటి అంతస్థు నందు గల ఖాళీగా ఉన్న 19 షాప్ రూములు పై షాపు రూములలో SC లకు షాపు నెం. 1.2.4.6& 8, ST లకు నెం. 3,7 & 10 బ్రహ్మణులు షాపు నెం. 9 గలవి.	లీజు కిచ్చిన తేది నుండి 3 సంవత్సరములు	హెచ్చు పాట	రూ.30,000/-	రూ.3,00,000/-	వేలం తేది : 19.06.2023 ఉదయం 10.30 గంటల నుండి
7.	నానుబాల వీధి షాపింగ్ కాంప్లెక్స్ షాపు నెం. 01,2,4&6 **4 = షాపులు** పై షాపు రుములలో ఎస్.సి (SC) లకు షాపు నెం. 4& 6, రజక/నాయిబ్రహ్మణ లకు షాప్ నెం.1 వికలాంగుల లకు షాప్ నెం. 02		హెచ్చు పాట	రూ.30,000/-	రూ.3,00,000/-	
8.	మేదర వీధి షాపింగ్ కాంప్లెక్స్ నందలి జనరల్ కేటగిరికి చేందిన షాపు నెం. 4 మరియు (మొదటి అంతస్తు) నందలి షాపు నెం.-1 నుండి 4&6 నుండి10 = 10 షాపులు షాపు నెం: కెటగిరి SC 1,10, షాప్ నెం. కేటగిరి ST 3,7, PH/: కేటగిరి 4 రజక/నాయిబ్రహ్మణ/కేటగిరి: షాప్ నెం.2,6,8&9	లీజు కిచ్చిన తేది నుండి 3 సంవత్సరములు	హెచ్చు పాట	రూ.30,000/-	రూ.3,00,000/-	
9.	రోడ్లు జంక్షన్ రాజధాని షాపింగ్ కాంప్లెక్స్ 7 నందలి ST కేటగిరి కి చెందిన షాప్ నెం.01	లీజు కిచ్చిన తేది నుండి 3 సంవత్సరములు	హెచ్చు పాట	రూ.30,000/-	రూ.3,00,000/-	
10.	OPP మునిసిపల్ ఆఫీస్ షాపింగ్ కాంప్లెక్స్, స్టాల్ నెం- 9,10,13 **= 04 షాపులు** పై షాపు రుములలో ఎస్.సిల (SC) కు స్టాల్ నెం.13, (ST) కు స్టాల్ నెం, 09		హెచ్చు పాట	రూ.60,000/-	రూ.10,00,000/-	

షరతులు :- 1) టెండర్ కం వేలం పాటలో పాల్గొనదలచిన వారు వేలం పాట మొదలు పెట్టె ముందర డిపాజిట్ చెల్లించి తేది: 17.06.2023 తారీఖు సాయంత్రం గం 5.00 లోపు పొందిన సాల్వెన్సీ సర్టిఫికేట్‌తో పాటు ఒరిజినల్ ఇ.సి దాఖలు చేసి వేలం పాటలో పాల్గొనవలసినదిగా తెలియజేయడమైనది. **2)** ప్రభుత్వ ఉత్తర్వులు G.O.Ms.No.56, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ మరియు అర్బన్ డెవలప్మెంట్ (J1) తేది.05-02-2011 నకు లోబడి షరతులు వర్తించును. **3)** నగరపాలక సంస్థ నకు చెందిన ఖాళాగా ఉన్న షాపులు పూర్తి వివరముల కొరకు కార్యాలయ పని చేయు వేళలో రెవిన్యూ సెక్షన్‌ను సంప్రదించగలరు.

సం / సి. ఓబులేసు
కమిషనర్, శ్రీకాకుళం నగరపాలక సంస్థ

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా టిడిపిదే విజయం

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా టిడిపిదే విజయమని మహానాడుతో స్పష్టమైందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన పార్టీ కార్యాలయ ఆవరణలో నేతలు, కార్యకర్తలతో శనివారం ఇష్టాగోష్ఠి నిర్వహించారు. నాలుగేళ్ల పాలనలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి రాష్ట్రాన్ని అథోగతి పాల్జేశారని విమర్శించారు. 2014లో రాష్ట్రం విడిపోయి రూ.16 వేల కోట్ల నష్టంతో ఉంటే, 2019 నాటికి రూ.65 వేల కోట్ల ఆదాయంతో వైసిపికి అప్పగించామన్నారు.

భవిష్యత్‌కు భరోసా పేరుతో ప్రకటించిన పథకాలను ప్రతి కార్యకర్త ఇంటింటికీ తెలియజేయాలన్నారు. వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి టిడిపి బలోపేతానికి మరింత కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో రాజారెడ్డి పాలనను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఈనెల 10వ టిడిపి కార్యాలయ ప్రారంభానికి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్, పినకాన అజయ్ కుమార్, బగాది శేషగిరి, జీరు భీమారావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

చంద్రబాబును దళితులు నమ్మరు

ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

గత టిడిపి ప్రభుత్వం దళితులకు చేసిందేమీ లేదని, చంద్రబాబును దళితులు ఎవరూ నమ్మరని ఉప ముఖ్యమంత్రి, ఎక్సైజ్, వాణిజ్యశాఖ మంత్రి కె.నారాయణస్వామి అన్నారు. నగరంలోని ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో సాంఘిక సంక్షేమశాఖ మంత్రి ఎం.నాగార్జునతో కలిసి శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దళితులుగా పుట్టేందుకు ఎవరైనా ఇష్టపడతారంటూ గతంలో చంద్రబాబు దళితులను తీవ్రంగా అవమానించారని చెప్పారు. టిడిపి పాలనలో దళితులపై దాడులు చేసినా పట్టించుకోలేదని విమర్శించారు. దళితులకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో జగన్మోహన్ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తుంటే, ఆ ఇళ్ల స్థలాలను శ్మశానంగా పోల్చారని మండిపడ్డారు. దళితులకు చేసే మేలు చేసే విషయంలో ఎవరేం చేశారో చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. గతంలో ఆమదాలవలసకు చెందిన కళ్యాణి అనే దళితురాలు తనకు జరిగిన అన్యాయంపై అప్పటి మంత్రి అచ్చెన్నాయుడు వద్దకు వెళ్లి మొర పెట్టుకుంటే ఆయన ఆమెను కాలితో తన్నిన సంఘటన రాష్ట్రంలోని దళితులు మర్చిపోలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు చంద్రబాబు నాయుడు మళ్లీ ఎస్‌సి, ఎస్‌టిలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని, ఆయన మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. బి.ఆర్ అంబేద్కర్ కలలు కన్న ఆశయాలకు అనుగుణంగా సిఎం జగన్మోహన్‌రెడ్డి గత నాలుగేళ్లుగా పరిపాలన అందిస్తున్నారని చెప్పారు. నాలుగేళ్ల పాలనలో దళితులకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని చెప్పారు. అవినీతికి తావులేకుండా రాష్ట్రంలో ఇప్పటివరకు రూ.2.50 వేల కోట్ల నిధులను డిబిటి ద్వారా ప్రభుత్వం పేదల ఖాతాల్లో నగదు జమ చేసిందని చెప్పారు. అమరావతిలో కనీసం అంబేద్కర్ విగ్రహం కూడా చంద్రబాబు పెట్టలేకపోయారని చెప్పారు. ఈ ఏడాది చివరి నాటికి విజయవాడ ప్రధాన కూడలిలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించనున్నారని మంత్రులు వివరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న నారాయణస్వామి

మాట తప్పడం... మడమ తిప్పడం ఇలానా..?

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రసంగాల్లో మాట తప్పను, మడమ తిప్పను అన్న మాట పదేపదే వినిపిస్తుంది. ఆ నినాదానికి రాజమార్గం వదిలి అడ్డదారుల్లో అమలు చేయడంలో, వెనక్కి తగ్గడంలో నూతన పద్ధతులను చూస్తున్నాం. జిల్లా రాజకీయాల్లో తాజాగా అలాంటి ధోరణి టెక్కలి నియోజకవర్గంలో బట్టబయలైంది. ముఖ్యమంత్రి జగన్ అమరావతిలో, జిల్లా పర్యటనలో రెండుసార్లు దువ్వాడ శ్రీనివాస్ టెక్కలి అభ్యర్థి అని, ఆయన్ను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మీడియా ప్రతినిధుల సమావేశంలో చెప్పిన మాటలను బట్టి జగన్ ప్రజలకు చేసిన విజ్ఞప్తిని బుట్టదాఖలు చేసినట్లు స్పష్టమైంది. టెక్కలి నియోకవర్గ ఇన్‌ఛార్జిగా తన సతీమణి దువ్వాడ వాణి ఉంటారని, వచ్చే ఎన్నికల్లో ఆమె అభ్యర్థి అని స్పష్టం చేశారు. అధినేత జగన్‌ను తాను ఒప్పించి ఈ ప్రకటన చేస్తున్నానని మీడియా సమావేశంలో చెప్పారు. అధినేతను ఒప్పించడమంటే తీసుకున్న నిర్ణయాల్లోంచి వెనక్కి తగ్గడమే. జగన్ అంత బలహీనులా? లేకుంటే నేతల అభిప్రాయాలను గౌరవించి నిర్ణయాలను మార్చుకుంటున్నారా?. అదే నిజమైతే ఎంతమంది నేతలను జగన్‌ను ఒప్పిస్తారు? లేకుంటే జగన్‌ను ఎంతమంది నేతలు ఒప్పిస్తే నిర్ణయాలు మార్చుకుంటారన్నది ముందు తేలాల్సి ఉంది. ఈ ప్రకటనలు, పరిణామాలు వైసిపి నిర్మాణంలో డొల్లతనం ఏ స్థాయిలో ఉందన్నది మరోసారి బట్టబయలైంది. పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మార్పు, ఆమె అభ్యర్థి అవుతారన్న ప్రకటనతో జిల్లాలోని వైసిపి సీనియర్ నేతలు విస్తుపోయినట్లు తెలిసింది.

దువ్వాడ కుటుంబంలో రగులుతున్న రచ్చ ఈనాటిది కాదు. అవి పరాకాష్టకు చేరుకున్నాయి. వారి పంచాయితీ అధినేత జగన్ వరకు వెళ్లాయి. దువ్వాడ శ్రీనివాస్‌ను అయితే ఓడిస్తామని, ఆయన బదులు సతీమణి వాణిని ఇన్‌ఛార్జిగా నియమించి, టిక్కెట్ ఇస్తే మాకు అభ్యంతరం లేదని అసమ్మతి నాయకులు ఇప్పటికే ప్రకటించారు. జగన్ మాటను కాదనలేక వాణికి టిక్కెట్ ఇవ్వాలని కోరడం వెనుక శ్రీనివాస్‌ను ఒంటరి చేసే లక్ష్యంగా రాజకీయ వ్యూహం నడిపినట్లు అర్థమవుతోంది. శ్రీనివాస్‌పై ఉన్న ఫిర్యాదులు, ఆరోపణలను వచ్చే ఎన్నికల్లో ప్రత్యర్థులు ఉపయోగించుకోకుండా ఉండాలంటే అభ్యర్థిని మార్చడం అవసరమని గుర్తించే ఇలాంటి నిర్ణయం తీసుకుంటున్నట్లు కనిపిస్తోంది. అసలు దువ్వాడ శ్రీనివాస్ చేసిన ప్రకటన చెల్లుబాటు అవుతుందా? అన్నదే ప్రశ్నార్థకంగా మారింది. ఇంతవరకు ఆ పార్టీలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి తన స్థానంలో మరొకరిని నియమించినట్లు తానే ప్రకటించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇన్‌ఛార్జి నియామకానికే పరిమితం కాలేదు. అభ్యర్థిని కూడా ఆయన ప్రకటించేశారు. సాధారణంగా ఏ పార్టీలోనైనా ఇలాంటి మార్పులను నాయకత్వమే ప్రకటిస్తుంది. వైసిపిలో అయితే ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి గానీ కనీసం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ గానీ చివరకు వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ గానీ ఇలాంటి మార్పును ప్రకటించాల్సి ఉంటుంది. ఈ దొంతర్లు ఏవీ పనిచేయలేదు. నీకు నువ్వే మార్పును ప్రకటించాలని అధినేత జగన్ దువ్వాడకు చెప్పి ఉండాలి. కనీసం ఈ మార్పు గురించి జగన్, జిల్లా సీనియర్ నేతలతోనైనా సంప్రదించలేదని విశ్వసనీయంగా తెలిసింది.



వైసిపిలో సమిష్టి ఆలోచనలతో తీసుకున్న నిర్ణయాలు ఉండవని తేలిపోయింది. కనీసం దువ్వాడ శ్రీనివాస్ ప్రకటన చెల్లుబాటు అవుతుందని జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ప్రకటించినంత వరకు ఆ ప్రకటనకు ఎలాంటి విలువ లేదని సీనియర్లు చెప్తున్నారు. ఈ ప్రకటనతో టెక్కలి నియోజకవర్గ నేతలు, కార్యకర్తలు కొంత అయోమయంలో పడ్డారని తెలిసింది. తీవ్రమైన ఒత్తిళ్ల వల్ల అలాంటి ప్రకటన చేయాల్సి వచ్చిందని, దీని వెనుక జగన్ ఆమోదం ఉండదని మరికొంతమంది నేతలు చెప్తున్నారు. అలాంటి ఒత్తిడి ఎవరి నుంచి వచ్చిందో వేరేగా చెప్పాల్సిన పనిలేదని సీనియర్లు ముచ్చట్ల రూపంలో చెప్పుకుంటున్నట్లు తెలిసింది. ఇదేదో పార్టీ నిర్ణయంగానే భావించి కొందరు వైసిపి అభిమానులు సెంటిమెంట్ అస్త్రాన్ని ప్రచారం చేయడం ప్రారంభించారు. కింజరాపు కుటుంబం మహిళల చేతిలోనే ఓటమిపాలైందని, ఆ సెంటిమెంట్ ఈసారి మళ్లీ పనిచేస్తుందని చెప్తున్నారు. నేటి అస్థిత్వ రాజకీయాల్లో అలాంటి సెంటిమెంట్లకు విలువ ఉండదని ఏనాడో తేలిపోయింది. దువ్వాడ శ్రీనివాస్ చెప్పిన మాటలను బట్టి జిల్లాలో అభ్యర్థుల మార్పుల గురించి ఎంతమంది ఎలా జగన్‌ను ఒప్పించి, మెప్పించి ఫలితాలు పొందుతారో చూడాల్సి ఉంది.

జిల్లాలో వైసిపి నేతలు ఎన్నికల ప్రచార ప్రక్రియను అప్పుడే ప్రారంభించారు. ఆయా నియోజకవర్గాల్లో ముఖ్య నేతలతో కాబోయే అభ్యర్థులు సంప్రదింపులు చేస్తూ పరిస్థితులను సమీక్షిస్తున్నట్లు తెలిసింది. అసమ్మతిరాగాన్ని మాత్రం నేతలు పట్టించుకున్నటు కనిపించడం లేదు. అధినేత ప్రకటించిన తర్వాత అసమ్మతి రాగం ఆగిపోతుందన్న విశ్వాసంలో కొందరు ఉన్నారు. అలాంటి వారి మౌనరాగం వెన్నుపోట్లకు, ఫిరాయింపులకు దారితీసే పరిస్థితులు నాలుగు నియోజకవర్గాల్లో కనిపిస్తోంది. శ్రీకాకుళం నియోజకవర్గంలో ముఖ్య నేతలు 13 మందితో ధర్మాన ప్రసాదరావు కమిటీని ఏర్పాటు చేసి ప్రచార బాధ్యతలను అప్పగించేందుకు దిశానిర్దేశం చేయనున్నారని తెలిసింది. పోలింగ్ బూత్‌ల వారీ ఓటర్ల సర్వే కార్యక్రమం జిల్లాలో చేపట్టనున్నట్లు తెలిసింది. ఒక్కమాటలో చెప్పాలంటే జిల్లాలో వైసిపి నేతలు ఎన్నికల ప్రచార గోదాలో మునిగిపోయినట్లు వెల్లడవుతోంది.

- సత్తారు భాస్కరరావు

ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న అప్పన్న

బోయ వాల్మీకులను ఎస్‌టిల్లో చేర్చొద్దు

ప్రజాశక్తి- కొత్తూరు

బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చేందుకు ఇటీవల అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మక అప్పన్న డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి గొట్టిపల్లి వచ్చారు. విషయం తెలుసుకున్న గిరిజనులు బేనర్ పట్టుకుని నినాదాలు చేశారు. బోయ, వాల్మీకులను ఎస్‌టిలో చేర్పిస్తే గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆమె వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే గిరిజన గ్రామాల్లో తాగునీటి సదుపాయం కల్పించాలని రోడ్లు, సెల్ టవర్లు నిర్మించాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. అనంతరం వినతిపత్రం అందజేసేందుకు ప్రయత్నించారు. వినతిపత్రం తీసుకుండానే ఎమ్మెల్యే కారులో వేగంగా వెళ్లిపోయారు. ఆమె వెంట వెళ్లే వెంటేందుకు ప్రయత్నించగా.. ఎస్ఐ గోవింద ఆధ్వర్యాన పోలీసులు గిరిజనులను అడ్డుకున్నారు. అనంతరం గ్రామ సచివాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కె.శరత్‌బాబు, చిన్నబాబు, సేదు, శ్రీనివాసరావు, ఆరిక తవిటినాయుడు, ఆరిక వెంకటరావు, ఆరిక నవీన్, నిమ్మక గోపి, కొండగొర్రి లవకుమార్ పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న డిఇఒ తిరుమల చైతన్య

జెవికె పంపిణీలో అప్రమత్తం

డిఇఒ తిరుమల చైతన్య

రణస్థలం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న జగనన్న విద్యా కానుక కిట్లను అందరికీ సకాలంలో అందించేందుకు హెచ్‌ఎంలు కృషి చేయాలని డిఇఒ డాక్టర్ తిరుమల చైతన్య ఆదేశించారు. రణస్థలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని జెవికె స్టాక్ పాయింట్‌ను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రభుత్వ పాటశాలల్లో చదువుకునేందుకు ఆసక్తి చూపే విధంగా అందరూ కృషి చేయాలన్నారు. ముందుగా పదో తరగతి సప్లమెంటరీ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఇఒ ఎ.త్రినాథరావు, హెచ్‌ఎం జి.రాజకిషోర్, సిఆర్‌పిలు ఎం.శ్రీనివాసరావు, జె.శ్రీనివాసరావు, ఎస్.రామకృష్ణ, జి.గౌరినాయుడు, పొగిరి విజయకుమార్ పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న సుధాకర్

వంతెన నిర్మాణ పనులు వేగవంతం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణంలో కూలిన బాహుదా రోడ్డు వంతెన పనులు వేగవంతం చేసి నెల రోజుల్లో పూర్తి చేస్తామని రోడ్ల భవనాలశాఖ ఎస్ఇ జాన్ సుధాకర్ అన్నారు. కూలిన బాహుదా రోడ్డు వంతెన నిర్మాణ పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ వంతెన నిర్మాణ పనులు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. తాత్కాలిక వంతెన నిర్మాణం పూర్తయిన వెంటనే చిన్న వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని అన్నారు. ఆటో, ద్విచక్ర వాహనాల రాకపోకలకు అనుమతించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో ఇఇ సత్యనారాయణ, డిఇ రామినాయాడు, ఎఇ మోహనరావు, పాల్గొన్నారు.

టెక్కలి తహశీల్దార్‌గా ప్రవల్లికాప్రియ

టెక్కలి : టెక్కలి మండల తహశీల్దార్‌గా ప్రవల్లికాప్రియ శనివారం బాధ్యతలు చేపట్టారు. సారవకోట తహశీల్దార్‌గా పనిచేస్తూ... ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా ఉన్న బెండి గిరిబాబును సోంపేట తహశీల్దార్ కార్యాలయ డిటిగా బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో పలాస తహశీల్దార్ కార్యాలయంలో భూ రీ సర్వే డిటి రవికుమార్‌ని నియమించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ సింహాచలంను నందిగాం తహశీల్దార్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో వజ్రపుకొత్తూరు తహశీల్దార్ కార్యాలయం నుంచి ఎస్.కిరణ్‌కుమార్ బదిలీ అయ్యారు.

కిడ్నీ వ్యాధి నియంత్రణకు కృషి చేయాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఉద్దానం ప్రాంతాల్లో 9 ఆరోగ్య శిబిరాల్లో మూడు వేల మందికి రక్త పరీక్షలు నిర్వహించగా అందులో 263 మందికి కిడ్నీ వ్యాధి ఉన్నట్లు నివేదిక ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా అధ్యక్షులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఆయన ఛాంబరులో ఉద్దానం కమిటీ సభ్యులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్దానం ప్రాంతాల్లో మరిన్ని ఆరోగ్య శిబిరాలు నిర్వహించి 18 ఏళ్ల దాటిన ప్రతి ఒక్కరికీ రక్త పరీక్షలు నిర్వహించారు. ఒకవేళ కిడ్నీ వ్యాధి ఉంటే ముందు స్థాయిలోనే తెలుసుకొని వ్యాధి తీవ్రతను తగ్గించే అవకాశం ఉంటుందన్నారు. అన్ని ప్రభుత్వ రంగ సంస్థలు చిత్తశుద్ధితో వ్యవహరించి ఉద్దానం ప్రాంత ప్రజలకు సాధ్యమైనంత వరకు, శక్తివంచన లేకుండా కిడ్నీ వ్యాధిని పూర్తిగా తరిమికొట్టే దిశగా అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ బొడ్డేపల్లి మీనాక్షి, అడిషనల్ డిఎంఅండ్‌హెచ్ఒ అనురాధ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ నాయక్, నెఫ్రాలజిస్టు విద్యాసాగర్, డిప్యూటీ లేబర్ కమిషనర్ ప్రసాదరావు, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ చిన్నారావు, అసిస్టెంట్ డైరెక్టర్, డ్రగ్స్ అండ్ కాస్ట్యూమ్స్ ఎ.చంద్రరావు, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ లక్ష్మి, సోంపేట ఆరో అదనపు జిల్లా జడ్జి శ్రీదేవి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

అలాగే జైలులో ఉన్న ఖైదీల కేసులు, వారి స్థితిగతులు గురించి పరిశీలించారు. బెయిలు వచ్చిన షూరిటీలు రాక జైల్లో ఉన్న ఖైదీల కోసం, ఛార్జీషీటు ఇంకా ఫైల్ చేయలేని కేసులను త్వరగా ఛార్జిషీటు ఫైల్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎడిషన్ ఎస్‌పి విఠలేశ్వరరావు, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు పాల్గొన్నారు.

వాలంటీర్ల సేవలు అమోఘం

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

లబ్ధిదారులకు సంక్షేమ పథకాల చేరవేతలో వాలంటీర్ల సేవలు అమోఘమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద మండలంలో ఉత్తమ సేవలందించిన గ్రామ సచివాలయ వాలంటీర్లకు సత్కార సభను శనివారం నిర్వహించారు. సేవా రత్న, సేవా వజ్ర, సేవా మిత్ర పురస్కారాలతో వాలంటీర్లను సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వచ్ఛందంగా సేవలందిస్తున్న వాలంటీర్లకు సన్మానించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వానికి జవసత్వాలు అందిస్తూ ఊపిరిగా వాలంటీర్లు నిలుస్తున్నారని కొనియాడారు. ముఖ్యమంత్రి ఆశయాలు ఆలోచనలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా ప్రజలకు అందించడంలో వాలంటీర్ల సేవలు వెలకట్టలేనివని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కె.వి.జి.సత్యనారాయణ, జెడ్‌పిటిసి సురవరపు నాగేశ్వరరావు, వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు బెవర మల్లేశ్వరరావు, మార్కెట్ కమిటీ అధ్యక్షులు బెవర కృష్ణవేణి, వైస్ ఎంపిపిలు శివానందబాబు, లావేటి అనిల్ కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు కోవిలాపు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలతో స్పీకర్ సీతారాం

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

సోంపేట : సోంపేట విద్యుత్ సబ్‌స్టేషన్ల మరమ్మతు పనుల నిమిత్తం ఆదివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఇఇ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా స్టేషన్ పరిధిలోని సోంపేట, బిరుసువాడ, జింకిభద్ర, పెంకిలి, పలాసపురం, లక్కవరం, ఇసకలపాలెం, రుషికొద్దా, రామయ్య పట్నం, తలతంపర, మండపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు.

అందరూ కలసికట్టుగా ఉండాలి

టెక్కలి: ప్రతిఒక్కరూ కలసికట్టుగా ఉండాలని ఎస్ఐ ఎల్.రామకృష్ణ తెలిపారు. మండలంలోని పాతనౌపడలో దళితులు ఫిర్యాదు మేరకు శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దళితులు మాట్లాడుతూ గ్రామంలో 16 కుటుంబాలు ఉన్నాయని, అగ్రకులాల వారు తమపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని, తరచూ కులం పేరుతో దూషిస్తున్నారని ఎస్ఐ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో సర్పంచ్ దల్లి సంధ్యారాణి, దల్లి లోకేష్‌రెడ్డి, ఎంపిటిసి అప్పలరెడ్డి, మాజీ సర్పంచ్ పరపటి చిన్నయ్యరెడ్డి, సమతా సైనిక్‌దళ్ జిల్లా కార్యదర్శి చల్లా రామారావు, బలగ భీమారావు, గొడ భాస్కరరావు, సంతోష్ పాల్గొన్నారు.

జ్ఞాపికను అందుకుంటున్న వేణుగోపాలకృష్ణ

అరసవల్లి సందర్శన

శ్రీకాకుళం: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని రాష్ట్ర సమాచారశాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, దేవాదాయ సహాయ కమిషనర్ హరి సూర్య ప్రకాష్ స్వామి శనివారం దర్శించుకున్నారు. ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ, ఆలయ అర్చకులు మంత్రికి పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అనివెట్టి మండపంలో వారి చిత్రపటాలను అందజేశారు. కార్యక్రమంలో తూర్పుకాపు, కళింగ వైశ్య కార్పొరేషన్ల చైర్మన్లు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిణి గడెమ్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జ్ఞానభారతి విద్యార్థుల సంతాపం

ఇచ్ఛాపురం : ఒడిశాలోని బాలేశ్వర్ జిల్లాలో శుక్రవారం రాత్రి జరిగిన ఘోర రైలు ప్రమాదంలో వందలాది మంది మృతి చెందిన కుటుంబాలకు స్థానిక స్వర్ణ భారతి జూనియర్ కళాశాల విద్యార్థులు శనివారం సంతాపం తెలిపారు. ఈ మేరకు రెండు నిముషాలు మౌనం పాటిస్తూ... నివాళ్లర్పించారు. కార్యక్రమంలో స్వర్ణ భారతి విద్యా సంస్థల చైర్మన్ చాట్ల తులసీదాస్‌రెడ్డి, చాట్ల రామురెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జల్లు జయప్రకాష్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సందీప్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నివాళ్లర్పిస్తున్న విద్యార్థులు

ఎన్‌ఎంఎస్‌లో విద్యార్థుల ప్రతిభ

బొరివంక...

కవిటి: ఎన్ఎంఎం స్కాలర్ షిప్‌కు తమ పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.రామకృష్ణ తెలిపారు. 2023 ఫిబ్రవరిలో నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ పరీక్షలో పాఠశాలకు చెందిన నౌపడ ఉదయ్, ఈరోతు గణేష్‌రావు, మద్దిల సాయిచరణ్, లోళ్ల సారిక మంచి ప్రతిభ కనబరిచారని, వీరికి ఏడాదికి రూ.12 వేలు చొప్పున నాలుగేళ్లు స్కాలర్ షిప్ అందుతుందని హెచ్‌ఎం తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం ఎస్.రామకృష్ణ, సర్పంచ్ బి.శ్రీరామ్‌ప్రసాద్, ఎంపిటిసి బి.సతీష్, ఎంపిటిసి మాజీ సభ్యులు బి.విజయకుమార్, పాఠశాల కమిటీ చైర్మన్ ఎం.బొనమాలి, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

సీతాపురం...

టెక్కలి : మండలంలోని సీతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో 8వ తరగతి చదివిన ముగ్గురు విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ పరీక్షలో పాల్గొని ప్రతిభ జనబరిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్తారు వేణికుమారి తెలిపారు. తమ పాఠశాలకు చెందిన బంగారు ధరణిశ్రీ, మళ్లా సంయుక్త, రాకోటి జీవన్‌లు జాతీయ ఉపకార వేతనానికి ఎంపిక కాబడడంపై అభినందనలు తెలిపారు.

లఖిదాసుపురం...

నందిగాం : మండలంలోని లఖిదాసుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో 8వ తరగతి చదివిన బాలక జశ్వంత్‌సాయి జాతీయ ఉపకార వేతనం పొందేందుకు అర్హత సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిలుకు కృష్ణారావు తెలిపారు. విద్యార్థి ఎంపికపై పాఠశాల ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయులు బాలక రామారావు, తులసీప్రసాద్, ఆర్.రామారావు, బెందాళం రత్నం అభినందనలు తెలిపారు.

ఎపి మోడల్ స్కూల్...

జి.సిగడాం : ఎన్ఎంఎంఎస్ ఫలితాల్లో ఎపి మోడల్ స్కూల్‌కు చెందిన కెల్ల ఉదయ్ కుమార్, సువ్వాడ పూర్ణిమ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అన్నా సామ్యూల్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఉపాధ్యాయులు అభినందించారు.

జలుమూరు: మండలంలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న 11 మంది విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైనట్లు ఎంఇఒ బి.మాధవరావు తెలిపారు. కరవంజ మోడల్ స్కూల్‌లో అత్యధికంగా ఏడుగురు విద్యార్థులు ఎంపిక కాగా, శ్రీముఖలింగం హైస్కూల్ నుంచి ఇద్దరు, ఎలమంచిలి హైస్కూల్ నుంచి ఇద్దరు, చల్లవానిపేట నుంచి ఒకరు ఎంపికైనట్లు చెప్పారు.

రైతులతో మాట్లాడుతున్న ఎస్ఐ, తహశీల్దార్

పరిహారం ఇచ్చాకే పనులు

ప్రజాశక్తి - కవిటి

కరాపాడు టోల్‌గేట్ భూసేకరణలో తనకు పూర్తిస్థాయి పరిహారం అందించిన తరువాతే తమ భూములు స్వాధీనం చేసుకోవాలని బాధిత రైతులు తేల్చి చెప్పారు. టోల్‌గేట్ సమీపంలోని రైతుల వద్ద సేకరించిన భూముల్లో పైప్‌లైన్ ఏర్పాటుకు శనివారం సిబ్బంది వచ్చారు. విషయం తెలుసుకున్న సంబంధిత రైతులు సంఘటన స్థలానికి చేరుకుని పనులు అడ్డుకున్నారు. దీంతో ఎస్ఐ రాము, తహశీల్దార్ సంతోష్ సంఘటన స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. అనంతరం తమ గోడు చెప్పుకునేందుకు శనివారం సాయంత్రం తహశీల్దార్ కార్యాలయానికి రైతులు చేరుకున్నారు. 2018 నుంచి అదిగో.. ఇదిగో అంటున్నారే తప్ప తమకు పరిహారం ఇవ్వడం లేదని, ఇప్పటికైనా తమకు న్యాయం చేసి పరిహారం అందించాలని తహశీల్దార్ సంతోష్‌ను కోరారు. కార్యక్రమంలో రైతులు పనపాన పాపారావు, పి.భానుమతి, ఎల్.ఢిల్లేశ్వరి, ఉప్పాడ గోపాల్, జి.గణేష్, పెద్దలు యు.పద్మనాభం, పి.దేవేంద్ర, పి.ఉమాపతి, యు.గిరి పాల్గొన్నారు.

వివరాలను సేకరిస్తున్న పోలీసులు

నలుగురికి గాయాలు

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని కృష్ణాపురం సమీపంలో శనివారం రెండు ద్విచక్ర వాహనాలను కారు ఢీకొన్న సంఘటనలో నలుగురు గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిలకపాలెం-పొందూరు రహదారిలో ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలను చిలకపాలెం నుంచి వచ్చిన కారు బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో లావేరు మండలం మురపాకకు చెందిన వండాన సిమ్మినాయుడు, ఆయన భార్య సరస్వతి, అలాగే మరొక ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న పొందూరుకు చెందిన గుంటుకు సంతోష్‌కుమార్, అతని తల్లి సూర్యకాంతంలు గాయపడ్డారు. రాజాం చెందిన కారు డ్రైవర్ పి.శ్రీనివాసరావు నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు క్షతగాత్రులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించి అనంతరం 108లో శ్రీకాకుళంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు.

వృద్ధురాలికి...

మెళియాపుట్టి : మెళియాపుట్టిలో భిక్షాటన చేసుకొని జీవనాధారం సాగిస్తున్న మదనో ప్రధానికు శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో గాయపడింది. వెంటనే స్థానికులు 108లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం జిల్లా సర్వజనాస్పత్రికి రిఫర్ చేశారు. క్షతగాత్రురాలు చెల్లి సరోజిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ నరసింహారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పుస్తెలతాడు చోరీ

నందిగాం : మండలంలోని చిన్నలవ్విపల్లిలో శుక్రవారం రాత్రి గురుజు భారతమ్మ తన ఇంట్లో గ్రిల్ తలుపులు గడియాపెట్టి నిద్రిస్తుంది. గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి చొరబడి ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగార పుస్తలతాడును అపహరించారు. శనివారం ఉదయం లేచి చూసేసరికి పుస్తెలతాడు లేకపోవడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ మహమ్మద్ అమీర అలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ కౌన్సిలర్ మృతి

ప్రజాశక్తి- పలాస

జోగారావు (ఫైల్)

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్, మాజీ ఎంపిటిసి సీరపు జోగారావు (65) శనివారం విశాఖపట్నంలోని ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ విశాఖపట్నంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స కోసం కుటుంబ సభ్యులు చేర్పించారు. జోగారావు 1998 ఎంపిటిసిగా ఎన్నికై మండల విప్ వ్యవహరించారు. అనంతరం 2002లో పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఏర్పడిన తరువాత మొట్టమొదటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరుపున వజ్జ బాబూరావు, చైర్మన్ హయాంలో కౌన్సిలర్‌గా గెలుపొందారు. ఆయనకు భార్య లక్ష్మి, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతిపై మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, మాజీ చైర్మన్ వజ్జ బాబూరావు, ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్ సభ్యులు డి.మహారణ, హరినారాయణ, రాజారావు, అంది రామకృష్ణ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

టెక్కలి : టెక్కలి పంచాయతీ అంబేద్కర్ వీధికి చెందిన నాగవంశం బాలమ్మ తన స్థలం ఆక్రమించుకున్నారని సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డిని శనివారం కలిసి విన్నవించారు. స్థానిక శ్యాంసుందరాపురం వద్ద ఉన్న వైఎస్ఆర్ జగనన్న కాలనీలో తనకు 59 నంబరు గల ఇంటి పట్టా మంజూరు చేశారని అన్నారు. ఇల్లు నిర్మాణానికి సిద్ధపడితే తన స్థలంలో వేరే వ్యక్తులు పునాదులు వేశారని తెలిపారు. తన స్థలాన్ని ఆక్రమించి ఎవరో కూడా తెలియని వాపోయారు. ఆక్రమణను తొలగించి తన స్థలాన్ని తనకు ఇప్పించాలని కోరారు.

పరిశీలిస్తున్న అబ్దుల్ సాదిక్ షేక్

వక్ఫ్‌బోర్డు స్థలం స్వాధీనం

ఇచ్ఛాపురం : పట్టణంలో ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రి వద్ద ఉన్న వక్‌బోర్డుకు సంబంధించిన పీర్ల పంజా స్థలం ఆలయ అభివృద్ధి కమిటీ నుంచి అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. జిల్లా వక్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ఆడిటర్ అబ్దుల్ సాదిక్ షేక్ బృందం పరిశీలనకు వచ్చింది. ఇటీవల నిర్వహించిన గ్రామ దేవత సంబరాలు సందర్భంగా ఈ పీర్ల పంజా స్థలాన్ని ఆలయ అభివృద్ధి కమిటీలీసుకు తీసుకుంది. లీసు గడువు పూర్తి కావడంతో కమిటీ ప్రతినిధులు పిలక సంతోష రెడ్డి, వల్లంపాటి మూర్తి వద్ద నుంచి లీజు స్థలం డాక్యుమెంట్లను స్వాదీనం చేసుకున్నారు. కార్యక్రమంలో రియాజ్ ఖాన్, జోహర్ ఖాన్, అలీం ఖాన్, అబ్దుల్లా, మస్తాన్ షరీఫ్, పర్వజ్ ఖాన్, అబ్దుల్ మన్నన్ పాల్గొన్నారు.

బాక్సర్‌కు ఆర్థికసాయం

శ్రీకాకుళం: నగరానికి చెందిన బాక్సర్ హరీష్ ఎంతో మంది విద్యార్థులను బాక్సర్లుగా మలచి జిల్లాకు మంచి పేరు తెచ్చారు. కొన్ని నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స తీసుకుంటూ ఇబ్బందుల్లో ఉన్నారు. వృత్తి రీత్యా బాక్సర్ కావటంతో ఇప్పుడు ఏమి చేయలేని పరిస్థితి. మందులకు, వైద్య పరీక్షలకూ డబ్బులు లేక కుటుంబం కష్టాల్లో పడింది. ఇది గమనించిన నగరానికి చెందిన కేన్యు రియో కరాటే చీఫ్ రెడ్డి ఢిల్లేశ్వరరావు తోటి బాక్సర్లను, కరాటే, కుంగ్-ఫు మాస్టర్లను సహాయం కోరారు. వారు ముందుకొచ్చిన తోటి బాక్సర్లకు శనివారం రూ.15 వేలు ఆర్థికసాయం అందించారు.

ఆర్థికసాయం అందజేస్తున్న ఢిల్లేశ్వరరావు

జీడికి గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రచారం చేస్తున్న నాయకులు

పలాస : జీడి పిక్కల 80 కేజీల బస్తా రూ.16 వేలు నిర్ణయించి, రైతు బరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని జీడి రైతుల సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని సున్నాదేవి, నీలావతి, మాకన్నపల్లి, గొల్లమాకన్నపల్లి, చిన్నమాకన్నపల్లి, మర్రిపాడు, మామిడిపల్లి, బొడ్డపాడు తదితర ప్రాంతాల్లో జీడి రైతుల సంఘం నాయకులు శనివారం పర్యటించారు. సోమవారం పలాస ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి కాశీబుగ్గ మూడు రోడ్ల కూడలి వరకు జీడి రైతులు నిర్వహించనున్న ర్యాలీకు హాజరుకావాలని పోస్టర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీడిని పంటగా గుర్తించి పంటల జాబితాలో చేర్చాలన్నారు. ఉద్దానానికి జీడి పంటే ప్రధాన జీవనాధారం అయినందున పలాస కేంద్రంగా జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేసి, జీడి అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ కింద రుణాలు మంజూరు చేయాలన్నారు. ప్రాంతీయ జీడి పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. నాణ్యమైన మొక్కలు, ఎరువులు, పురుగు మందులు ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు మద్దిల రామారావు, పి.కుసుమ, పి.వీరాస్వామి, అప్పయ్య, తెప్పల రాజు, సైన దేశయ్య, ఆర్.పురుషోత్తంలు తదితరులు పాల్గొన్నారు.

నగదు రహిత లావాదేవీలు సురక్షితం

పొందూరు: నగదు రహిత లావాదేవీలు ఖాతాదారులకు ఎంతో సురక్షితమని తాడివలస ఎపిజివిబి బ్రాంచ్ మేనేజర్ అరుణ్‌కుమార్ అన్నారు. మండలంలోని తాడివలసలో ఎపిజివిబి బ్రాంచ్ ఆధ్వర్యాన బ్యాంకు ఖాతాదారులకు ఆర్థిక అక్షరాస్యత అవగాహనా సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బ్యాంకు ద్వారా అందజేస్తున్న బంగారు, వ్యవసాయ రుణాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అలాగే ఇప్పటికే రుణాలు పొందిన డ్వాక్రా మహిళలు, రైతులు సకాలంలో చెల్లించాలన్నారు. ఖాతాదారులకు వ్యక్తిగత, ప్రమాద బీమాలపై అవగాహన కల్పించారు. ఖాతాదారులు ఫిక్స్ డిపాజిట్లు చేయడం ద్వారా అధిక వడ్డీలు పొందవచ్చు అని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్ఎల్‌సి నోడల్ ఆఫీసర్ రాఘవేంద్ర, సర్పంచ్ ప్రతినిధి టి.వి.జగన్నాథరావు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న మేనేజర్ అరుణ్‌కుమార్

మాట్లాడుతున్న ఎపిఎం కూర్మారావు

సంఘానికి సమావేశమే ఊపిరి

ప్రజాశక్తి- ఆమదాలవలస

స్వయం శక్తి సంఘాలకు క్రమం తప్పని సమావేశాలే ఊపిరి అని, సక్రమమైన పుస్తక నిర్వహణే ప్రాణమని వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మండలంలోని కొర్లకోట పంచాయతీ కార్యాలయంలో తమ్మినేని రాధమ్మ అధ్యక్షతన శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా సంఘాల అభివృద్ధికి పలు పథకాలను అందిస్తుందని, వాటిని సక్రమంగా వినియోగించుకుని మీ జీవనోపాధులను అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. బ్యాంకులు ఇచ్చిన రుణాలను సద్వినియోగం చేసుకుని ఫుడ్ ప్రాసెసింగ్‌తో పాటు ఇతర యూనిట్లు నడుపుకున్న వారికి అదనంగా, అవసరమైన మిషనరీస్ కొనుగోలు నిమిత్తం ప్రభుత్వం 35 శాతం సబ్సిడీ అందిస్తుందని వివరించారు. ప్రతి సంఘమూ అభివృద్ధి కోసం పంచ సూత్రాలు పాటించాలని తెలిపారు. సంఘంలోని ఆర్థిక లావాదేవీలపై సభ్యులందరికీ అవగాహన ఉండాలన్నారు. సంఘ నిధి నుంచి సభ్యులు అవసరం మేరకు అప్పులు వాడుకుని, వాయిదాల ప్రకారం రూ.రూపాయి వడ్డీతో సంఘానికి తిరిగి చెల్లించాలని సూచించారు. సంఘం స్థాయిలో, సభ్యులు స్థాయిలో సరైన పుస్తక నిర్వహణ చేస్తూ, రికార్డులను భద్రపరచాలని సూచించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల్లో మహిళా రైతులంతా సభ్యులుగా చేరి ప్రభుత్వం అందిస్తున్న సమిష్టి ప్రయోజనాలు పొందాలన్నారు. షెడ్యూల్ ప్రకారం ఆన్‌లైన్‌లో మొబైల్ బుక్ కీపింగ్ చేస్తూ... అన్ని సంఘాలూ ఎ-గ్రేడ్‌లో ఉండేటట్లు పనిచేయాలని విఒఎ సువ్వారి వనజాక్షికి సూచించారు. కార్యక్రమంలో గ్రామ సంఘం ప్రతినిధులు, స్వయం శక్తి సంఘాల లీడర్లు, క్లస్టర్ కో-ఆర్డినేటర్ రమణ, చందరరావు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

శ్రీకాకుళం రూరల్ మండలం సింగుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం నిర్వహించారు. 1993-1994 బ్యాచ్ విద్యార్థులు పాల్గొని ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం మేము ఉన్నత స్థితిలో ఉండటానికి కారకులైన ఉపాధ్యాయులకు రుణపడి ఉన్నామని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గుండ ఆదిత్యనాయుడు, ప్రిన్సిపాల్ బి.శ్రీరామ్మూర్తి, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం బి.శ్రీరాములు నాయుడు, నవజీవనరావు, పి.సిమ్మన్న పాల్గొన్నారు.

నౌపడ: నౌపడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు శనివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. చదువులమ్మ ఒడి నుంచి విడిపోయి మళ్లీ 17 ఏళ్ల తర్వాత ఒకరినొకరు కలిసి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలు, మరపురాని సన్నివేశాలను మననం చేసుకున్నారు. 2006లో చదివిన పదో తరగతి బ్యాచ్ నుంచి 70 మంది విద్యార్థులు అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. విద్యార్థులందరినీ ఒకసారిగా చూసిన ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారాయణమూర్తి, గోపాలకృష్ణ, శ్రీనివాసరావు, రాంబాబు, రామారావు, మల్లేశ్వరరావు, సింహాచలం పాల్గొన్నారు.

నౌపడ : ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పోలీస్‌స్టేషన్ తనిఖీ

మెళియాపుట్టి : స్థానిక పోలీస్ స్టేషన్‌ను టెక్కలి డిఎస్‌పి బాల చంద్రారెడ్డి శనివారం సందర్శిం చారు. ఈ మేరకు స్టేషన్‌లోని రికా ర్డులను పరిశీలించారు. సరిహద్దుల్లో గంజాయి, సారా అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు చేపట్టాలని సూచించారు. రాత్రి వేళల్లో నిఘా పెంచాలన్నారు. ఈయన వెంట పాతపట్నం సిఐ వినోద్‌బాబు, ఎస్ఐ టి.రాజేష్, ఎఎస్ఐ నర్సింగరావు, అప్పన్న, సూర్య ఉన్నారు.

నేటి నుంచి ఉత్సవాలు

వజ్రపుకొత్తూరు: మండలంలోని మెట్టూరు పంచాయతీ ఒంకులూరులో ఉన్న కొండమహంకాళి అమ్మవారి ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమవుతాయని ఒంకులూరు ఆదిబలిజ సంఘం, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. సైనికులు, విశిష్ట వ్యక్తులకు సన్మానాలతో కార్యక్రమాలు ఆరంభమవుతాయని అన్నారు. ఈ ఉత్సవాలు సందర్భంగా మూడు రోజుల పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.

విజ్ఞాన శిబిరాలను వినియోగించుకోవాలి

ఎచ్చెర్ల : అవగాహన కల్పిస్తున్న చంద్రశేఖర్

ఎచ్చెర్ల : హిందీ భాష జాతీయ భాష అని, ప్రాథమిక స్థాయి నుంచే హిందీపై పట్టుసాధించాలని రిసోర్‌పర్సన్ చంద్రశేఖర్ అన్నారు. దర్మవరం శాఖాగ్రంథాలయంలో విద్యార్థులకు హిందీ భాష నేర్చుకోవడంపై అవగాహన కల్పించారు. ఈ దేశం వివిధ సంస్కృతులు, భాషలు కలిగిన అనేక రాజ్యాల కలయికని అన్నారు. హిందీలో దిత్వాక్షరమలు చదువుతూ రాయడం నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మల్లిపెద్ది చంద్రశేఖరరావు, సహాయకులు బి.సూర్యనారాయణ, పాఠకులు సూరిబాబు, ప్రకాష్, టేకి ఆచారి, జగదీష్, మహేష్, సురేష్, కిరణ్, శంకర్ పాల్గొన్నారు.

లావేరు : వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం మురపాక శాఖాగ్రంథాలయంలో విద్యార్థులు ఆటాపాటలతో సంతోషంగా గడిపారు. రోజూ రిసోర్స్ పర్సనల్ ద్వారా విజ్ఞానానికి సంబంధించిన అన్ని విషయాలనూ విద్యార్థులు పూర్తిస్థాయిలో నేర్చుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు పలు పాటలకు నృత్యాలు చేశారు. అలాగే పాటలు పాడారు. తొలుగ మనం- మన గ్రంథాలయంలో భాగంగా పుస్తకాలను దులపడం, గ్రంథాలయ ఆవరణలో చెత్తా చెదారం తీసి పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, గ్రంథాలయ సహాయకులు పి.షణ్ముఖరావు పాల్గొన్నారు.

టెక్కలి : టెక్కలి గ్రంథాలయంలో మన గ్రంథాలయం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు శ్రమదానం చేశారు. కార్యక్రమంలో 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సహాయకులు అమ్మనమ్మ పాల్గొన్నారు.

లావేరు : నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

అంగన్వాడీల ఇంటర్వ్యూలు

టెక్కలి : టెక్కలి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని పది అంగన్వాడీల పోస్టుల భర్తీకి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. కూర్మనాథపురానికి కార్యకర్త, సంతబొమ్మాళి మండలం భావనపాడు, మరువాడ, మేఘవరం, టెక్కలి మండలంలోని తెలినీలాపురం, కొండభీంపురం, శివరాంపురానికి సహాయకులు, వి.ఆర్.కె.పురం, సూరాడవానిపేట, ఆర్.సున్నాపల్లి మినీ అంగన్వాడీలకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు పిఒ శోభారాణి తెలిపారు. ఈ ఇంటర్వ్యూల్లో డిప్యూటీ డిఎండిహెచ్‌ఒ లక్ష్మీతులసి, పీడీ జయదేవి, అంగన్వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఎంఇఒపై సస్పెన్షన్ ఎత్తివేత

ప్రజాశక్తి- వీరఘట్టం

స్థానిక మండల విద్యాశాఖ అధికారి పి.కృష్ణమూర్తిపై సస్పెన్షన్ ఎత్తివేసినట్లు శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది ఏప్రిల్ 20న వీరఘట్టం మండలం రేగులపాడులోని కెజిబివిని రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ సందర్శించినప్పుడు 8వ తరగతి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయలేదని నెపంతో ఎంఇఒ పి.కృష్ణమూర్తిని సస్పెండ్ చేసినట్లు పాఠకులకు తెలిసిందే. శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం బొండపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు ప్రధాన ఉపాధ్యాయులుగా బదిలీ చేస్తూ ఉత్వరులు జారీ అయ్యాయి.

చలివేంద్రిలో 'ఫ్యామిలీ డాక్టర్'

వీరఘట్టం: మండలంలోని చలివేంద్రి గ్రామంలో శనివారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జి.ప్రదీప్ కుమార్ చంటి పిల్లలు, గర్భిణులు, జ్వర పీడితులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు తీవ్రత అధికంగా ఉన్నందున బయటకు వెళ్ళవద్దని ఒకవేళ వెళితే గొడుగు వేసుకుని బయటికి వెళ్లాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ శాంతకుమారి, ఏఎన్ఎం జి. పైడితల్లి, టెక్నీషియన్, ఎం ఎల్ హెచ్‌పి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రజకుల స్థలాలపై పెత్తందారుల దౌర్జన్యం ఆపాలి

వీరఘట్టం : రజకుల స్థలాల పై పెత్తం దారుల దౌర్జన్యం ఆపాలని సిపిఐఎంఎల్ పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి పి భాస్కరరావు డిమాండ్ చేశారు. శనివారం మేజర్ పంచాయతీ రెండో వార్డు పరిధిలో గల రజకుల స్థలాలను పరిశీలించిన ఆయన మాట్లాడారు. గుర్రాల గౌరీ శంకర్, గుర్రాల తవిటమ్మ, నకిరాపు సూరమ్మల వద్ద 1998 నుంచి ఉంటున్న ఇళ్ల స్థలాలను ఇదే గ్రామానికి చెందిన వ్యాపారి ఈ స్థలం తనదంటూ దౌర్జన్యానికి పాలపడుతున్నాడని ఆరోపించారు. అతనిపై చర్యలు తీసుకుని రజకలకు న్యాయం చేయాలని కోరారు.

కాలుష్య నివారణకు కృషి

చీపురపల్లి: కాలుష్య నివారణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆశయ సంస్థ అధ్యక్షులు రెడ్డి రమణ అన్నారు. ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురష్కరించుకుని శనివారం మూడు రోడ్ల జంక్షన్ నుండి జివిఆర్ కాలేజ్ వరకు జిల్లా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీను ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఉద్యోగి కంది హేమంత్ ప్రారంభించారు. ఆశయ సంస్థ అధ్యక్షులు రెడ్డి రమణ మాట్లాడుతూ యునైటెడ్ నేషన్స్ జనరల్ ఆసెంబ్లీ జూన్ 3 తేదీన ప్రపంచ సైకిల్ దినోత్సవంగా జరుపుకోవాలని నిర్ణయించారన్నారు. ఈ కార్యక్రమంలో చీలకయ్య, ఆశయ సంస్థ సభ్యులు చంటి పాల్గొన్నారు.

చెత్తతో అవస్థలు

పేరుకుపోయిన చెత్త

పలాస: మండలంలోని పురుషోత్తపురం నుంచి సీతరామనగర్‌కు వెళ్లే రోడ్డుపై చెత్తా చెదారం పేరుకుపోయింది. దీంతో ఆ ప్రాంత ప్రజలతో పాటు ప్రయాణికులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్డుపై చెత్త చెదారం నిల్వ ఉండడంతో దుర్వాసన వస్తుందని, దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయని వాపోయారు. రాత్రి సమయంలో కంటిపై కునుకు లేకుండా దోమలు చేస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఈ రహదారిపై ఎంతో మంది ప్రయాణం చేస్తుంటారని, పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించాలని పదేపదే అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని విమర్శించారు. తక్షణమే మున్సిపల్ అధికారులు చొరవ చూపి రోడ్డుపై పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

లావేరు : పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

ఎంపిడిఒగా అప్పారావు

జలుమూరు: ఎంపిడిఒగా ఐ.వి.అప్పారావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇప్పటివరకు పార్వతీపురం మన్యం జిల్లాలోని పార్వతీపురం ఎంపి డిఒ కార్యాలయంలో పరిపాలనాధికారిగా పనిచేశారు. ఉద్యోగోన్నతుల్లో భాగంగా ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఇన్‌ఛార్జి ఎంపిడిఒ జి.వి.రవికుమార్ ఉద్యోగోన్నతిపై నరసన్నపేట బదిలీ అయ్యారు. ఈ మేరకు సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

పారిశుధ్య పనులు పరిశీలన

మాట్లాడుతున్న కమిషనర్ నాగేంద్ర కుమార్

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో అపారిశుధ్యంపై దృష్టి సారిస్తున్నట్లు కమిషనర్ నాగేంద్రకుమార్ తెలిపారు. కాశీబుగ్గ, పలాస ప్రాంతాల్లో పారిశుధ్య పనులను శనివారం పరిశీలించారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు పలు సూచనలు చేశారు. అనంతరం పారిశుధ్య కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీలో పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపాలిటీలో ఎక్కడికక్కడ చెత్తాచెదారం పేరుకుపోయినట్లు ఫిర్యాదులు చేస్తే కఠినంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అందుకు సచివాలయం ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు అపారిశుధ్యం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు.

సూపరింటెండెంట్‌గా రాంబాబు

కొత్తూరు : మండల పరిషత్ పరిపాలన అధికారిగా బసవ రాంబాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన సారవకోటలో పనిచేస్తూ... ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన చిన్నమ్మడు సారవకోట ఎంపిడిఒ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్

సీతంపేట : మహిళలు, మహిళా సంఘాలు రుణాల ద్వారా వ్యాపారం చేసుకుంటూ ఆర్థిక స్వాలంబన ఉంటుందని డిఆర్‌డిఎ పిడి పెద్దింటి కిరణ్ కుమార్ అన్నారు. శనివారం స్థానిక ఎంఎంఎస్ కార్యాల యంలో సిపిఎం సిసిలు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిడి కిరణ్ కుమార్ మాట్లాడుతూ మహిళలకు 25 ఏళ్లుగా వెలుగు ద్వారా రుణాలు ఇస్తున్నప్పటికీ ఆర్థికంగా ముందుకు వెళ్లడం లేదని అన్నారు. జీవనోపాధులు మెరుగు పడేలా వైయస్సార్ క్రాంతి పథకం సిబ్బంది మహిళా సంఘాలను తయారు చేయాలన్నారు. ఉన్నతి పథకం ఆసరా వంటి పథకాలు ఉన్నప్పటికీ వారికి వ్యాపారంపై దృష్టి సారించాలన్నారు. దీనికి సంబంధించిన మెలకువలు నేర్పాలని అన్నారు. సమావేశంలో ఎపిఎం విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

'108'లో ప్రసవం

మగబిడ్డకు జన్మనిచ్చిన మణి

జి.సిగడాం : మండలంలో గొబ్బురుకి చెందిన బి.మణి శనివారం అంబులెన్స్‌లో ప్రసవించింది. మణికి పురిటి నొప్పులు ప్రారంభం కావడంతో కుటుంబ సభుయలు 108కి ఫోన్ చేశారు. సిబ్బంది వెంటనే గర్భిణిని రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి తరలిస్తున్నారు. మార్గంమధ్యలో నొప్పులు అధిక కావడంతో అంబులెన్స్ ఇఎంటి సతీష్‌కుమార్, ఆశా కార్యకర్త ప్రథమ చికిత్స నిర్వహించారు. దీంతో మణి మగబిడ్డకు జన్మనించింది. అనంతరం రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో అంబులెన్స్ పైలెట్ ఎల్.ఎన్.మూర్తి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

సీతంపేట : ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యా యుల సమస్యలను ఉప ముఖ్య మంత్రి, గిరిజన సంక్షేమ శాఖామంత్రి పి.రాజన్నదొర వద్దకు తీసుకొని వెళ్లిన ఆదివాసీ జెఎసి సీతంపేట ప్రధాన కార్యదర్శి, బిడ్డిక ఉమామహేశ్వరరావు, అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను మినిమమ్ టైమ్ స్కేల్ అమలుపర్చాలని అడగ్గా మంత్రి సానుకూలంగా స్పందిస్తూ అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను మినిమమ్ టైమ్ స్కేల్, వారిని సిఆర్‌టిలుగా అప్‌గ్రేడ్ చేసేలా చర్యలు తీసుకొని న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. అలానే బోయ, వాల్మీకి, శ్రీకాకుళం జిల్లాలో బెంతు ఒరియాలమని చెప్పుకుంటున్న నకిలీ బెంతు ఒరియాలను ఎస్‌టిజాబితాలో చేర్చ కుండా కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామని, వారిని మన ఆదివాసీ తెగలో కలపకుండా చేస్తామని, ఆదివాసీ మనుగడను, అభివద్ధిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కలిసి కట్టుగా ముందుకు పోవాలని కోరారు.

డిప్యూటీ సిఎంకు వినతినిస్తున్న ఉపాధ్యాయులు

చిన్నారి చికిత్సకు సిఎం సహాయం

రేగిడి : మండలంలోని కందిశ గ్రామానికి చెందిన పొన్నగంటి లావణ్య, కన్నబాబుల కుమార్తె హేమలత కేన్సర్‌తో బాధపడుతుంది. వావిలవలసకు చెందిన సామాజిక కార్యకర్త పాలూరి సిద్ధార్థ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని తాడేపల్లిగూడెం లో కలిసి ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన సిఎం రూ. లక్షతో పాటు హేమలతకు హాస్పిటల్ వైద్యానికి సిఎం రిలీఫ్ ఫండ్ కింద ప్రతి నెలా ఆస్పత్రిలో జమ చేసేందుకు రూ. 38వేలు ఇవ్వనున్నట్లు అంగీకరించారు.

ప్రజాశక్తి

శ్రీశ్రీశ్రీ అన్నపూర్ణమ్మ అమ్మవారి పండగ మహోత్సవం

ప్రత్యేక అనుబంధం

Advt. Feature

4 పేజీలు | మందస | శ్రీకాకుళం జిల్లా | ఆదివారం 04-06-2023

రారండోయ్..

వేడుక చూద్దాం

- ఘనంగా అన్నపూర్ణమ్మ అమ్మవారి ఉత్సవాలు
- ఆకట్టుకుంటున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - మందస

మందసలో ప్రసిద్ధి చెందిన అన్నపూర్ణమ్మ అమ్మ వారికి ఏళ్ల చరిత్ర ఉందని పూర్వీకులు చెప్తున్నారు. ఆలయం నిర్వహణ, బాగోగులను అప్పటి రాజులు చూసేవారు. అమ్మవారికి ఉత్సవాలు రాజుల హయాంలోనే జరిగేవి. అప్పటి నుంచి ఐదేళ్లకోసారి ఒకసారి అమ్మ వారి పండగ నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా ఈ ఏడాది మే 27 నుంచి జూన్ ఆరో తేదీ వరకు ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. రాజా శ్రీనివాస్ మహారాజు హయాంలో మందస పెద్ద దేవాంగుల వీధికి చెందిన దాసరి అన్నయ్య తండ్రికి అన్నపూర్ణమ్మ ఉత్సవాల బాధ్యత అప్పగించారు. నాటి నుంచి నేటివరకు దాసరి కుటుంబ సభ్యులు అమ్మవారికి కన్నవారిగా వ్యవహరిస్తున్నారు. మొదటి పూజ వారితో చేయించడం ఆనవాయితీగా వస్తుంది. గ్రామంలో ఉత్సవాలు జరుగుతాయని పెద్దలు నిర్ణయించిన వెంటనే దాసరి కుటుంబ సభ్యుల ఇంటి ముందు తాత్కాలిక

మిగతా 3లో...

పోస్టుకార్డులు పంచుతూ...

ఆయన పేద కుటుంబంలో పుట్టారు. చిన్నతనంలోనే తండ్రి మృతి చెందగా... తల్లి ఇంటి బాధ్యతలను నెత్తిన వేసుకుని కుటుంబాన్ని నెట్టుకొచ్చింది. తల్లి తనకు డబ్బులు అడిగినా ఇవ్వకపోవడంతో తల్లి ఎదుటనా ఎలాగైనా ఎదగాలని పట్టుదలతో అనుకున్న లక్ష్యాన్ని సాధించి మందసలో కొబ్బరి కాయల హోల్‌సేల్ వ్యాపారిగా ఎదిగారు త్రినాథ్ సాహు. మందస ప్రాంతానికి చెందిన త్రినాథ్ సాహు ప్రస్తుతం కొబ్బరి కాయల హోల్‌సేల్ వ్యాపారిగా ఉన్నారు. ఐదో తరగతి చదివి భజన పాటలు, నాటకాలు నేర్చుకుని చుట్టూ ఉండే ప్రాంతాల్లో స్టేజ్ ప్రోగ్రామ్స్‌కు వెళ్లేవారు. 5వ తరగతి వరకు చదువుకుని 14 నుంచి 20 సంవత్సరాల వరకు బతుకు తెరువు కోసం స్నేహితుల సహకారంతో పోస్టు కార్డులను కిల్లోయి, హంసరాలి ప్రాంతాల్లో పంపిణీ చేస్తూ నెలకు వచ్చిన రూ.90తో కుటుంబాన్ని పోషించే వారు. ఆరు నెలలు తర్వాత ఆ పని లేకుండాపోవడంతో చిన్న కూరగాయల దుకాణం పెట్టి జీవనం సాగిస్తున్న సమయంలో అప్పులపాలయ్యారు. చివరకు బారువలో ఉన్న తన అత్తవారు సహాయంతో కొబ్బరి కాయల వ్యాపారం ప్రారంభించి ప్రస్తుతం ఒడిశా, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు కొబ్బరి కాయలను ఎగుమతి చేయడమే కాకుండా జిల్లాలో గొప్పిలి, గారబంద, చాపర, మెలియాపుట్టి ప్రాంతాలకు రోజూ రెండు నుంచి మూడు వరకు లారీల లోడ్‌తో ఎగుమతి చేసి వ్యాపారవేత్తగా ఎదిగారు.

- త్రినాథ్ సాహు, వ్యాపారవేత్త, మందస

మందస అభివృద్ధిలో కీలకపాత్ర

కిల్లంశెట్టి వెంకటరమణ

మందస ప్రాంత అభివృద్ధికి కిల్లంశెట్టి వెంకటరమణ కీలక పాత్ర పోషించారు. ఒకవైపు వ్యాపారాన్ని అభివృద్ధి చేస్తూ మరోవైపు రాజకీయాల్లో చురుగ్గా పాల్గొన్నారు. మజ్జి తులసీదాస్, మజ్జి శారద అనుచరులుగా ఉంటూ మందస ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపించారు. వాసుదేవ ఆలయం పున్ఃనిర్మాణంలో ఆయన కీలక పాత్ర పోషించారు. జగన్నాథ ఆలయం, గ్రామ దేవత అమ్మవారి అభివృద్ధికి కృషి చేశారు. గ్రామ దేవత ఉత్సవాల్లో సేవలు అందించి ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ఉత్సవాలు నిర్వహించారు. ఆయా ఆలయాలకు ఛైర్మన్‌గా పని చేశారు. ఇదిలా ఉండగా మరోవైపు వంట నూనె హోల్‌సేల్ వ్యాపారం చేస్తూ జిల్లా వ్యాప్తంగా సరఫరా చేసేవారు. మందసలో మొట్ట మొదటి కిరాణా దుకాణం పెట్టి ప్రజలకు తక్కువగా ధరలకు సరుకులు పంపిణీ చేసే వ్యక్తిగా గుర్తింపు పొందారు.

రాయితీలు కల్పించాలి

ఇప్పిలి వెంకటేశ్వరరావు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యాపారులకు ఎప్పటికప్పుడు రాయితీలు కల్పించడం ద్వారా యువత వ్యాపారాలు చేసేందుకు ముందుకు వస్తారని వ్యాపారవేత్త, గ్రామ దేవత ఉత్సవాల కమిటీ కార్యదర్శి ఇప్పిలి వెంకటేశ్వరరావు అన్నారు. ప్రభుత్వం జీఎస్‌టి ప్రవేశ పెట్టడంతో వ్యాపారానికి మంచే జరిగింది. పాత పద్ధతిలో వ్యాపార పన్నుల విధానంలో అవకతవకలు జరిగేవి. కానీ, ఇప్పుడు ప్రభుత్వానికి వెళ్లాల్సిన పన్నులు పూర్తిగా చెల్లిస్తున్నాం. వాటివల్ల బిజినెస్ పాయింట్లు వస్తున్నాయి.

బిజినెస్ పాయింట్లను బట్టి బ్యాంకులో సెక్యూరిటీ లేని రుణాలు ఇస్తున్నారు. ఈ ప్రాంతంలో వ్యాపార అభివృద్ధికి సెమినార్స్ పెట్టటం, కొత్త వారిని కొంత ప్రోత్సహించడం, వారికి సహాయ సహకారాలు అందించడం, తద్వారా వ్యాపారాన్ని అభివృద్ధి చెందుతుంది. తానూ గతంలో చిన్న పాన్ షాప్, కిరాణా దుకాణాలు పెట్టుకొని జీవనం సాగిస్తున్న సమయంలో మందస ప్రముఖ వ్యాపార వేత్త దేవరశెట్టి అప్పారావు 200 మందికి ఉపాధి కల్పించే విధానాన్ని చూపారు. తానూ అదేస్థాయికి ఎదగాలని పట్టుదలతో మందసలో రైస్ మిల్లుని అద్దెకు తీసుకుని కిళ్లంశెట్టి వెంకట రమణ సహాయ సహకారంతో జీడి పరిశ్రమ, రైస్ మిల్లు ఏర్పాటు చేసి వందకు పైగా కార్మికులకు ఉపాధి కల్పించడం ఆనందంగా ఉందన్నారు.

అంచెలంచెలుగా...

మందస గ్రామానికి చెందిన దేవరశెట్టి మార్కండేయులు అపరాలు వ్యాపారంతో ప్రారంభించి మూడు స్టోన్ క్రషర్ ఏర్పాటు చేసి అంచెలంచెలుగా ఎదిగి కార్మికులకు ఉపాధి కల్పించారు. ఆయన మాట్లాలోనే... మా తండ్రి దేవర శెట్టి అప్పారావు మందసలో అపరాలు విక్రయిస్తు జీవనం గడిపేవాళ్లం. అనంతరం వ్యాపారాన్ని అభివృద్ధి చేస్తూ... ముందుగా మందసలో అధునాతన రైస్ మిల్లు ఏర్పాటు చేసి కార్మికులకు ఉపాధి కల్పించాం. జీడి పరిశ్రమ, నర్సిపురం, వాసుదేవపురం, మందస ప్రాంతాల్లో స్టోన్ క్రషర్ ఏర్పాటు చేశామని చెప్పారు. అయితే మా వద్ద పని చేసిన డ్రైవర్లకు ప్రోత్సాహం అందించడంతో ఆర్‌టిసిలో ఉద్యోగులు పొందారు. మా వద్ద పని చేసిన కార్మికులు ఉన్నత స్థానంలో ఉండడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్నాం.

- దేవరశెట్టి మార్కండేయులు, వ్యాపారస్తులు, మందస

పేదల వైద్యులు 'జల్లు'

మందస ప్రాంతంలో పేదల వైద్యులు అని చెప్పాగానే ముందుగా గుర్తొచ్చేది జల్లు ధర్మారావు. ధర్మారావు పర్లాకిమిడి లింగుపురంలో గుర్రన్న, లక్ష్మీనరసింహకు మూడో సంతానంగా జన్మించారు. ధర్మారావు చదువుతున్న రోజుల్లో సంగీతం, సాహిత్యం, నాటకాలు వేస్తూ 1974లో ఎంబిబిఎస్ పూర్తి చేశారు. అనంతరం ఉమ్మడి జిల్లా వీరఘట్టం పిహెచ్‌సిలో మెడికల్ అధికారిగా పనిచేస్తూ మందస మండలానికి బదిలీపై వచ్చారు. 1980 నుంచి 1998 వరకు 18 ఏళ్ల పలు పిహెచ్‌సిల్లో పనిచేస్తూ... పేదల వైద్యులుగా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నారు. ఏ సమయంలో రోగులు తలుపు తట్టిన వెంటనే స్పందించి వైద్య సేవలు అందించేవారు. అతితక్కువ ధరకు దొరికే మందులను ఇచ్చేవారు.

ఆయన మృతి చెందినా, ఇప్పటికీ పేదల గుండెలో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆయనకు కళా రంగంపై ఉన్న మక్కువతో మందసలో మహేంద్ర కళా మండలి ఏర్పాటుకు కీలక పాత్ర పోషించారు. మందసలో సినిమా థియేటర్ నిర్మించి ప్రజలకు అందుబాటులో తక్కువ ధరలకు టిక్కెట్లు అమ్ముతూ నడిపించారు.

త్యాగమూర్తి 'విశ్వనాథం'

స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకైన పాత్ర

మందస జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల

కళాశాలకు విరాళంగా ఇచ్చిన స్థలం

మందస స్వాతంత్ర్య సమర యోధుడు అనగానే ప్రతిఒక్కరి నోటా గుర్తు ఉంచేది విశ్వనాథం. వైశ్య కుటుంబంలో పుట్టి సేవా కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. తన ఆస్తులు, ఉద్యోగం, రాజకీయ పరమైన పదవులు సైతం త్యాగం చేసిన గొప్ప వ్యక్తి విశ్వనాథం. మహాత్మా గాంధీ, భారత దేశం మొట్టమొదటి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీతో పరిచయాలు ఉన్న వ్యక్తి ఆయన.

ప్రజాశక్తి - మందస

మందస గ్రామానికి చెందిన తండ్రి వడ్డీ కృష్ణమూర్తి, సూరమ్మలకు 1907 సెప్టెంబరు 3న జన్మించి మందస అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేశారు. మారుమూల ప్రాంతంలో పుట్టినప్పటికీ దేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో చురుకైన పాత్ర పోషించి చివరకు 1998 జూన్ 1న మృతి చెందారు. ఆయనకు భార్య కనక రత్నం, ఇద్దరు కుమారులు పట్టాభి రాం, బాబుజీ ఉన్నారు. అయితే తనకు పుట్టిన కుమారులను స్వాతంత్ర్య సమర యోధుల పేర్లను నామకరణం చేశారు. విశ్వనాథం తాతా శాఖయ్య సుభిది అప్పటి మందస రాజు వద్ద దివాన్‌గా పని చేశారు. దీంతో ఆ కుటుంబానికి ఆ ప్రాంతంలో పరిచయాలు, ప్రజలతో మంచి సంబంధాలు ఉండేవి. ఇదిలా ఉండగా ఆయన పెద్ద కుమార్తె పేరును టంగుటూరి ప్రకాశం పంతులు కుమార్తె సూర్యకుమారి, పెద్ద కుమారుడు పేరును ఆల్ ఇండియా కాంగ్రెస్ అధ్యక్షుడు భోరరాజు పట్టాభి సీతారామయ్య 1940లో మందస ప్రాంతానికి వచ్చిన సమయంలో పెద్ద కుమారుడు జన్మించడంతో పట్టాభి రాం అని నామకరణం చేశారు. రెండో కుమారుడు 1947లో జన్మించడంతో బాబుజీ పేరు పెట్టి స్వాతంత్ర్య సమర యోధుడుగా మందస ప్రాంతంలో చిరస్థాయిగా నిలిచిపోయారు.

విద్యాభ్యాసం... చేపట్టిన పదవులు

మందస రాజు గారి ఉన్నత పాఠశాలలో ఒకటి నుంచి ఎస్ఎస్ఎల్‌సి వరకు చదివారు. ఇంటర్మీడియట్ బరంపురం ఖల్లికోటలో 1927లో విద్యాభ్యాసం చేశారు. పై చదువుల కోసం ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం బెనారస్ యూనివర్సిటీలో టెలిగ్రాం ఇంజినీరింగ్ పూర్తి చేశారు. అనంతరం 1930లో బ్రిటిష్ ప్రభుత్వం రైల్వే సంస్థలో సిగ్నల్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగ అవకాశం వచ్చింది. బ్రిటిష్ ప్రభుత్వంలో పని చేయడం ఇష్టం లేక సునాయాసంగా తిరస్కరించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1949లో మద్రాసు ప్రభుత్వం సెకండ్ క్లాస్ బెంచ్ మేజిస్ట్రేట్‌గా సోంపేట కోర్టుకు నియమించారు. జాతీయ కాంగ్రెస్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చినా ధన ప్రభావం వల్ల సున్నితంగా తిరస్కరించారు. 1960లో మందస పంచాయితీకు సర్పంచ్‌గా పని చేశారు. వైశ్య సంఘం ఏర్పాటు చేసి సంఘం బలోపేతానికి కృషి చేశారు. ఆ సంఘానికి అధ్యక్షులుగా కొన్నాళ్లు పని చేశారు.

అభివృద్ధి బాటలో...

స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డీ విశ్వనాథం మందస ప్రాంతానికి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. మందస రాజు ఆధీనంలో ఉన్న ఉన్నత పాఠశాలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా మార్చేందుకు ఎంతో కృషి చేశారు. చివరకు రాజును సైతం ఎదిరించి అనుకున్న లక్ష్యాన్ని సాధించడంలో కీలక పాత్ర పోషించారు. అయితే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు ప్రాథమిక పాఠశాలను జిల్లా పరిషత్‌లో విలీనం చేసేందుకు రూ.1900లు రిజిస్ట్రేషన్ చేసేందుకు అవసరం కాగా, ఆ సమయంలో విశ్వనాథం ఆల్ ఇండియా కాంగ్రెస్ విశాఖపట్నం జిల్లా బోర్డు మెంబరుగా ఉన్న తన పదవిని త్యాగం చేసి సంతోష్ నాయక్ అనే వ్యక్తికి తన పదవి కట్టబెట్టారు. ఆయన నుంచి రూ.1900లు తీసుకుని రిజిస్ట్రేషన్ రుసుం చెల్లించిన వ్యక్తి విశ్వనాథం. సోంపేట మండలం బారువా ప్రాంతానికి సమితి కార్యాలయాన్ని అప్పటి మద్రాసు ఉమ్మడి ముఖ్యమంత్రి బెజవాడ గోపాలరెడ్డి ప్రభుత్వం మంజూరు చేయగా, అప్పటి ఎమ్మెల్యే స్వాతంత్ర్య సమర యోధుడు గౌతు లచ్చన్నతో చర్చించారు. అప్పటి నాయకులు సమితి కార్యాలయం ఇవ్వడం కుదరదని, అవసరమైతే సమితి అధ్యక్షుడుగా నియమిస్తామని చెప్పడంతో తనకు సమితి అధ్యక్షుడు పదవిని సున్నితంగా తిరస్కరించారు. అనంతరం మందసకు సమితి కార్యాలయం తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు. మందసలో ఆర్‌డిఒ కార్యాలయం ఏర్పాటుకు కృషి చేశారు. అయితే అప్పటి రాజు కార్యాలయం ఏర్పాటుకు భవనం ఇవ్వకపోవడంతో టెక్కలికి తరలిపోయింది. స్వాతంత్ర్య సమర యోధుడు, అప్పటి విద్యుత్ శాఖ మంత్రి గౌతు లచ్చన్న హరిపురం మీదుగా విద్యుత్ పనులు చేపట్టి విద్యుత్ సరఫరా చేస్తుండగా మందస ప్రాంతానికి విద్యుత్ సరఫరా చేయాలని పట్టుబట్టి గౌతు లచ్చన్నతో చర్చించారు. తొలిసారిగా సారిగా విద్యుత్ దీపాలు వేసేందుకు కృషి చేశారు. మందసలో జూనియర్ కళాశాల ఉండాలనే ఉద్దేశంతో తనకు ఉన్న ఆరు ఎకరాల స్థలాన్ని ప్రభుత్వానికి విరాళంగా ఇచ్చారు. మచిలీపట్నంకు చెందిన స్వాతంత్ర్య సమర యోధుడు, సంఘసంస్కర్త భాస్కర్ల గోపాల కృష్ణమూర్తి నుంచి కొంత మంది విద్యార్థులకు చదువుకునేందుకు ఆర్థికసాయం అందజేయడంలో కీలకపాత్ర పోషించారు.

ఉద్యమ బాటలో....

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బెనారస్ యూనివర్సిటీలో చదువుతున్న రోజుల్లో వడ్డీ విశ్వనాథం మోతిలాల్ నెహ్రూ, సరోజినీ నాయుడు నిర్వహించిన సభలకు హాజరై స్వాతంత్ర్య ఉద్యమాలకు ఉత్తేజమై చురుగ్గా పాల్గొన్నారు. 1930లో నౌపడలో మహాత్మా గాంధీ నిర్వహించిన ఉప్పు సత్యాగ్రహంలో కీలక పాత్ర పోషినందుకు అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం ఆరు నెలలు కఠిన కారాగార శిక్ష విధించారు. ఆయనకు బరంపురం, రాజమండ్రి, తమిళనాడు రాష్ట్రం వెల్లూరు జైలులో శిక్ష అనుభవించారు. జైలు జీవితం అనుభవిస్తున్న సమయంలో అప్పటి మద్రాసు ఉమ్మడి ముఖ్యమంత్రి బెజవాడ గోపాలరెడ్డితో పరిచయం ఏర్పడింది. నవంబరు 1930లో విడుదలై సైమన్ కమిషన్ ఉద్యమంపై ఆకర్షితులై చదువుకు స్వస్తి చెప్పారు. అప్పటి ఆంధ్రా ఉద్యమంలో పాల్గొని పర్లాకిమిడి, బరంపురం ప్రాంతాలను ఒడిశా రాష్ట్రంలో చేర్చరాదని, గిడుగు రామమూర్తి పంతులు ఆధ్వర్యాన గోపాలపురం వెళ్లి బేండర్ కమిషన్‌కు సాక్ష్యం చెప్పారు. దేశంలో జరిగే కాంగ్రెస్ మహా సభలకు హాజరు కావడమే కాకుండా కొంత మొత్తాన్ని విరాళంగా ఇచ్చారు. విదేశీ వస్త్ర బహిష్కరణ ఉద్యమంలో పాల్గొని తన వద్ద ఉన్న 26 సూట్‌లు సైతం కాల్చి బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. అనంతరం ఖాదీ వస్త్రాలను ధరించడమే కాకుండా అందరినీ ఖాదీ వస్త్రాలు ధరించే విధంగా కృషి చేశారు. అప్పటి గంజాం జిల్లా ప్రముఖులు విశ్వనాథ్ దాసు, వరహగిరి జోగయ్య, వరహగిరి వెంకట గిరి, న్యాయపతి నారాయణ మూర్తిలతో కలిసి పలు ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. మందస ప్రాంతానికి దేశ నలుమూలల నుంచి పెద్దపెద్ద నాయకులను తీసుకువచ్చి మందస ప్రాంత ప్రజలకు పరిచయం చేశారు. అప్పటి దేశ ప్రధాని ఇందిరాగాంధీని మందసకు తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు. 1939లో నిర్వహించిన ఆల్ ఇండియా రైతు మహాసభ కాశీబుగ్గలో నిర్వహించాలని పట్టుబట్టి స్వాతంత్ర్య సమర యోధుడు గౌతు లచ్చన్న సహకారంతో రైతు సదస్సు నిర్వహించడంలో కీలకపాత్ర పోషించారు. జాతీయ ఉద్యమానికి నిధులు సేకరించే సమయంలో తన వద్ద ఉన్న అతి ఇష్టమైన బంగారు ఉంగరాన్ని సైతం విరాళంగా ఇచ్చారు. దీంతో పాటు పలువురు నుంచి విరాళాలు సేకరించి జాతీయ ఉద్యమానికి ఇవ్వడంలో ఎంతో కృషి చేశారు.

రారండోయ్ వేడుక చూద్దాం

(మొదటిపేజీ తరువాయి)

పర్ణశాలను నిర్మిస్తారు. అమ్మవారి ఉత్సవాలు ప్రారంభించే రోజు అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆలయం నుంచి అమ్మవారిని పసుపు ముగ్రాట ఘటాలతో భాజా భజంత్రీల నడుమ ఊరేగింపుగా దాసరి కుటుంబ సభ్యులు ఇంటి ముందు ఏర్పాటు చేసిన పర్ణశాలలో పెట్టి అమ్మవారిని ప్రతిష్టించి పూజలు నిర్వహిస్తారు. ముందుగా గ్రామంలో ఉన్న కంచుమయి, భూలోకమ్మ, పాతపట్నం అమ్మవారు, పిడి మందసలో ఉన్న కిల్లమ్మ తల్లి అమ్మవార్లకు పసుపు, కుంకుమ, ముగ్రాటలతో ఆహ్వానం పలుకుతారు. ఉత్సవాలు ప్రారంభమైన మరుసటి రోజు నుంచి గ్రామ పుర వీధుల్లో అమ్మవారిని మేళతాళాల నడుమ ఊరేగిస్తారు. చివరి సమయంలో పర్ణశాలకు వచ్చే ముందు రాజు కోటకు వెళ్ళి భోగం అందుకోవడం జరుగుతుంది. ఇలా ప్రతిరోజూ గ్రామ పురవీధుల్లో ఊరేగించి రాజు కోటకు వెళ్ళి పర్ణశాలకు రావడం పూర్వం నుంచి ఆనవాయితీగా వస్తుంది. ఇలా తొమ్మిది రోజుల పాటు రోజుకు మూడు నుంచి నాలుగు వీధులలో అమ్మవారిని ఊరేగిస్తారు. ఉత్సవాల సమయంలో గ్రామమంతా అమ్మవారిని మూడుసార్లు తిప్పుతారు. ఉత్సవాల సమయంలో దాసరి కుటుంబ సభ్యులు ఇంటి వద్ద అమ్మవారు నిత్యం పూజలు అందుకుంటుంది. గ్రామ ప్రజలు నిత్యం అమ్మవారిని దర్శించుకుంటారు. తొమ్మిది రోజుల అనంతరం అమ్మవారిని తిరిగి ఆలయంలో పెడతారు.తొలిరోజు 27వ తేదీన గ్రామదేవతను గ్రామంలోకి ఆహ్వానించడం, 28న అమ్మవారి ఊరేగింపు, సాంస్కృతిక ప్రదర్శనలు, జానపద కెరటాలు కార్యక్రమం నిర్వహించారు. 29న అప్పలస్వామిరెడ్డి శిష్య బృందం జానపద, అభ్యుదయ గీతాల జిల్లాస్థాయి పోటీలు, 30న అమ్మవారిని బోనాలు, శైలజ బృందం నృత్య ప్రదర్శనలు, జూన్ ఒకటో తేదీన అమ్మవారి ఊరేగింపులో కాంతార, దాండియా మహారాష్ట్ర బృందాలతో నృత్యాలు, 2న విశాఖపట్నం ఝాన్సీ బృందం నృత్య ప్రదర్శనలు, 3న బిందె డాన్స్, 4న అఘోరాలు, భద్రకాళి, అష్టలక్ష్మి ప్రదర్శనలు, 5న అష్టలక్ష్మి నృత్యాలు, 6న అమ్మవారి నిమజ్జనం ఉంటుంది.

పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

మందస ప్రాంతంలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేస్తే యువతకు ఉపాధి అవకాశాలతో పాటు మందస, చుట్టుపక్కల ఉన్న ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత కల్పించి వలసలు నివారణకు చర్యలు తీసుకోవాలి. మందస ప్రాంతంలో ఎక్కువ శాతం రోజు కూలీలు ఉన్నారు. వారికి ఉపాధి కల్పించే బాధ్యత ప్రభుత్వాలు తీసుకోవాలి. పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంతమంతా అభివృద్ధి చెందుతుంది.

– వడ్డి చంద్రశేఖర్, వ్యాపారవేత్త, మందస

మందస అభివృద్ధికి కృషి చేశా

మందస ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ఎంతో కృషి చేశా. 1970 నుంచి 1990 వరకు సర్పంచ్‌గా పని చేశా. తాను సర్పంచ్‌గా ఉన్న సమయంలో ఆ రోజుల్లో 50 మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేశా. శ్రీనివాస్ రాజా మార్కెట్‌ను ఆధునికీకరించా. వేసవిలో చెరువులు అడుగంటి పోవడంతో నీరు నిల్వ ఉండే విధంగా చెరువులను అభివృద్ధి చేశా.

– కిల్లంశెట్టి హరికృష్ణ, మాజీ సర్పంచ్, మందస

అంగరంగ వైభవంగా అన్నపూర్ణమ్మ దేవి సంబరాలు



ఆకట్టుకుంటున్న సాంస్కృతిక కార్యక్రమాలు

మందస : ఉత్సవాల సందర్భంగా మందస పట్టణంతో పాటు పురవీధులు విద్యుత్ అలంకరణలతో ఆకర్షణీయంగా మారాయి. వీధుల్లో ఏర్పాటు చేసిన దేవతా మూర్తుల ప్రతిమలు చూసేందుకు గ్రామ ప్రజలతో పాటు ఇతర గ్రామాల నుంచి ప్రజలు తండోపతండాలుగా తరలివస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన పగటి వేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి.